నేటి దినపత్రిక
17వ
# సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామారాజు జిల్లా

శనివారం,13 ఏప్రిల్ 2024



# పిఠాపురం శ్రీపాదవల్లభ సంస్థానం వద్ద వ్యక్తిపై దాడి

- దాడి చేసిన వ్యక్తులను ఆటో యూనియన్ సభ్యులుగా గుర్తించిన పోలీసులు
- దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పిఠాపురం పట్టణ పోలీసులు



**పిఠాపురం,మేజర్‌న్యూస్** :దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న, ప్రశాంతంగా ఉండే పిఠాపురంలో శుక్రవారం జరిగిన దాడి సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. శ్రీపాద వల్లభ క్షేత్రం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఆటో యూనియన్ పేరుతో కొంతమంది వ్యక్తులు హల్ చల్ చేస్తూ అక్కడికి వచ్చే వారిపైతెరమగౌడవలకు దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు శ్రీపాద వల్లభ మహా సంస్థానం వద్ద నిత్యకృత్యంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఇక్కడ తమదే యూనియన్ అని, తమ ఆటోలు మాత్రమే ఎక్కాలంటూ, తాము చెప్పినంత ఇవ్వాలని తరచూ ఇబ్బందులు పెడుతూ... ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పిఠాపురం ప్రతిష్టను పెంచే శ్రీపాద వల్లభ మహాసంస్థానం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా యూనియన్ నిర్వహించడంపై స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీపాద వల్లభ సంస్థానం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న యూనియన్ ను తొలగించాలని, పిఠాపురం ప్రతిష్టను మసకబారకుండా అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని భక్తులు, పిఠాపురం పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో అర్చకుల దందాపై

## ఎండోమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి

# భక్తుల ఫిర్యాదు





- కోనసీమ తిరుపతిలో అర్చక దందాపై ప్రముఖ పత్రికలో వార్తలు వచ్చినా.. మామూళ్ళు దండిగా అందుతుండటంతో అధికారులు చర్యలు తీసుకోని పరిస్థితి
- యధావిధిగా రెండు పళ్ళాలలో అర్చక దందా
- వెంకన్న దర్శనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న భక్తులు
- డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షణలోనే అవినీతా !




**కాకినాడ,మేజర్‌న్యూస్ :**

కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వరస్వామి కోరిన కోర్కెలు చిటికెలో తీర్చే దైవంగా భక్తుల విశ్వాసం. ఏడు శనివారాలు పదకొండు ప్రదక్షిణలు ఏడేడు జన్మల పుణ్యఫలంగా ఈ ఆలయం ఖ్యాతి గాంచింది. లక్షలాది మంది భక్తులు ప్రతీ శనివారం వాడపల్లి వెంకన్నను కొలుస్తూ ఉంటారు. అటువంటి కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకన్న సన్నిధిలో అర్చకుల లీలలు,పళ్లె లతో లక్షలాది రూపాయల కానుకల దందాపై జాతీయ తెలుగు పత్రిక సూర్యలో 'వాడపల్లి వెంకన్న సన్నిధిలో అర్చకుల దందా' అనే శీర్షికన ఈ నెల 5వ తేదీన వార్త ప్రచురితమైంది. దీనికి ఉభయ గోదావరి జిల్లాలతో అన్ని జిల్లాల్లో విశేష స్పందన కనిపించింది. అయితే భక్తులకు కనీస దర్శన భాగ్యం,వసతులులేకుండా ఉండడం, అదేవిధంగా రెండు పళ్ళేలతో భక్తుల నిలువు దోపిడీ చేస్తూ లక్షలాది రూపాయల కానుకలు అర్చక పూజారులు బయటకు తరలిస్తుండటంపై భక్తులు ఎండోమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాలవెన్, ఎండోమెంట్ కమిషనర్ ఎస్. సత్యనారాయణలకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో అధికారుల పూర్తిగా విఫలమయ్యారు.కనీసం గుక్కెడు మంచి నీళ్ళు దొరకవు.ప్రదక్షిణలు చేసి వచ్చిన భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆదాయం రూ. కోట్లలో ఉన్నా, సమస్యలు పరిష్కారం చేయలేకపోతున్నారు. సరైన వసతులు భక్తులకు అందకపోగా.. అర్చక పూజారులు నిలువు దోపిడీతో భక్తులు విసిగిపోతున్నారు. నెలకి రూ.50 లక్షల వరకు పళ్ళెంలో కానుకలు పడేలా ప్రణాళిక లు చేస్తూ..ఆ కానుకల ను తెలివిగా సంచుల్లో అర్చకులు దారి మళ్ళిస్తున్నారని భక్తులు చెబుతున్నారు. ఇక్కడి తొమ్మిది కుటుంబాల అర్చకులకు ఏడేసి ఏకరాల భూమి ని దేవాదాయశాఖ అందించింది.ఈ కోట్ల ఆదాయంలో విలాసవంతమైన భవనాలు, పెద్ద పెద్ద కార్లు కొనుగోలు చేసి విలాసాలకు భక్తుల కానుకలు వాడుకొంటున్నట్టు రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ ఎస్ సత్యనారాయణకి స్పెషల్ ప్రిన్సిపల్ కార్యదర్శి వాలవెన్ గార్లకు వీడియో లతో సహ ఫిర్యాదులు భక్తులు చేసారు.అయితే వీరి అక్రమ సంపాదన ఎంత , ఎన్ని లక్షల దేవుని ఆదాయం దారి మళ్లించి వీరు ఎక్కడెక్కడ ఆస్తులు కూడబెట్టారు, ఎన్ని కోట్లు వెనకేసారు.. అన్న విషయాలపై విజిలెన్స్ నిఘాతో అరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం . భక్తుల ఫిర్యాదు మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

## ముంపు మండలమైన చింతూరులో

## బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత విస్తృత ప్రచారం

- పోలవరం నిర్వాసితులకు న్యాయం బిజెపితోనే సాధ్యం - కొత్తపల్లి గీత





**చింతూరు,మేజర్‌న్యూస్** : ముంపు మండలం అయిన చింతూరు మండలంలో కేంద్రంలో శుక్రవారం బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంపూర్ణ న్యాయం జరగాలంటే బీజేపి, జనసేన, తెలుగుదేశం కూటమి తోనే సాధ్యమని అరకు పార్లమెంట్ కు పోటీచేస్తున్న బీజేపి అభ్యర్థి కొత్తపల్లి గీత పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం చింతూరులో రోడ్ షో నిర్వహించారు. తొలుత ఎర్రంపేట లో గిరిజన నృత్యం, కొమ్ము డ్యాన్స్ లతో ఘనంగా స్వాగతంపలికారు. ఏర్రంపేట నుండి చింతూరు వరకు రోడ్‌షో నిర్వహించారు. చింతూరు ప్రధాన కూడలి వద్ద గల గిరిజన అమర వీరులు ఘంటందొర, మల్లుదొర, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూల దండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గీత మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు సంపూర్ణ న్యాయం జరగాలంటే తెలుగుదేశం బిజెపి, జనసేన, ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను గోదారిలో ముంచి వేసిందని విమర్శించారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో 1 లక్ష15 వేల రూపాయలు ప్రతి ఎకరానికి పరిహారం ఇచ్చారని, జగన్ ఎకరానికి ఐదు లక్షలు పరిహారం ఇస్తామని, లక్ష 15 వేలు పోను 3లక్షల 85 వేలు ఇస్తామని, నిర్వాసితులైన రైతులకు పరిహారం ఇస్తామని పరిహాసం చేశారన్నారు. నిరుద్యోగులకు 10 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని ఆ హామీ ఏమైంది అని ప్రశ్నించారు. డీఎస్సీ నిరుద్యోగులకు దగా డిఎస్సి అయిందని విమర్శించారు. ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా నిర్మాణ రంగానికి తీవ్ర అన్యాయం చేశాడని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు రివర్స్ టెండరింగ్ పేరుతో ఒక్క అడుగు ముందుకు వేయలేదు అని విమర్శించారు. మూడు రాజధానుల పేరు చెప్పి మూడు ముక్కలాట ఆడి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్ అని కొత్తపల్లి గీత విమర్శించారు. రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిరియాల శిరీష మాట్లాడుతూ కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, మద్యపానం నిషేధం చేస్తాం అన్న జగన్ ప్రభుత్వం అధికారులతో విక్రయిస్తుందని, మెగాడి. యస్ సి పేరుతో నిరుద్యోగులతో దగా డిఎస్‌సి అని వర్ణించారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన అభ్యర్థులను గెలిపించాలని అప్పుడే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, నిత్యం ప్రజల మధ్యన ఉండే ప్రజా సమస్యలపై పోరాడతామని, ప్రజల పక్షాన ఉంటామని ఈ ప్రాంత ప్రజలు ఓటు వేసి గెలిపించి పార్లమెంటు అసెంబ్లీలకు తమను పంపాలని ఎమ్మెల్యే అభ్యర్థి శిరీష కోరారు. ఒక అంగన్వాడి కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్యే సీటు ఇచ్చి సామాన్యులకు సైతం చోటు కల్పించిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకులు పాయం వెంకయ్య, చింతూరు మండల బిజెపి అధ్యక్షులు డి.వి.ఎస్.ఎస్. రమణారెడ్డి (చిట్టిబాబు), నామాల శ్రీనివాస్, చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు చిన్నారెడ్డి, యూత్ అధ్యక్షులు సురేష్, శ్రీరామ్, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజుతో పాటు వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో అగ్రగామిగా మోడరన్ విద్యాసంస్థ



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్:**శుక్రవారంప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మోడరన్ జిఆర్‌సిజూనియర్‌కాలేజీ అన్ని గ్రూప్‌లలో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ నందు అత్యుత్తమ మార్కులు సాధించి పట్టణంలో అగ్రగామిగా నిలిచారని మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ నందు జి. వి సాయి దుర్గ 464, ఎస్. కీర్తన 463, పి.తరుణ్ కుమార్ 462,పి. తనూజ 462, కె.కీర్తిక 462,డి. అంజి 461, బి.జస్వంత్461,టి.సోఫియా 460 మార్కులు అలాగే బైపీసీ లో పి.లక్ష్మి సత్య శ్రావ్య -422, షేక్ అశ్వక్ 418, పి. భవాని -418, బి. చాందిని -416 మార్కులు అలాగే సిఈసిలో కెవిఎస్ రమ్య దుర్గ 485, మార్కులు, ఎంఈసి లో జి.చంద్రిక 480మార్కులు అలాగే సెకండ్ ఇయర్ ఎంపీసీ గ్రూప్ నందు ఐ. లాస్య -988, కె. సుహార్షిత్ -987, కె. గురుదత్త -984, ఎన్. సంతోష్ -981, పి మేఘన -981, సయ్యద్ హసీనా భాను -981, ఎల్. నిఖిత దేవి -980 మార్కులు సీనియర్ బైపీసీ నందు ఓ. సత్యవతి -985,ఎ. ప్రవీణ -971, పి. వినయశ్రీ 968, కె.ఎల్. శరణ్య 966, పి.అక్షర 966 మార్కులు, అలాగే సీనియర్ సీఈసీ నందు ఐ.హర్షిత 954 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన మోడరన్ విద్యార్థులను ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకుఈవిధంగా అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దిన మోడరన్ అధినేత జి.వి.రావు అభినంద నీయులని పేర్కొంటూ, ఈ విద్యార్థులు భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మాట్లాడుతూ సమర్ధవంతమైన అకడమిక్ ప్లాన్ మరియు అత్యుత్తమ బోధన వల్ల ఈ ఘన విజయం సాధ్యమైనదని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సి.హెచ్ శ్రీనివాస్, ఇంటర్ స్టాఫ్ అభినందనలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** శుక్రవారం వెలువడిన ఇంటర్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో కాకినాడ జోన్ శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 466, 465, 465, 464,... మరియు బైపిసి విభాగంలో 435, 433, 433,.. మార్కులు, అలాగే సీనియర్ ఇంటర్‌నందు 988, 987, 985, 984, 982, 980,...మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎం.హరిప్రసాద్, డీన్ ఎం.శ్రీనివాసు, ఎజిఎం ఎ.రాంబాబు, ప్రిన్సిపాల్స్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## పరిశీలకుని పెత్తనం.. పార్టీలో పితలాటకం.!

- వలస నేత చర్యలతో క్యాడర్ అసహనం..
- పి.గన్నవరం వైసీపీలో ఏం జరుగుతోంది..



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పేనుకు పెత్తనం ఇస్తే తలంతా బోడి చేసిందట..సరిగ్గా ఈ సామెతకు సరిపోలే నాయకుని పెత్తనంతో పి.గన్నవరం వైసీపీ అధోగతి పాలవుతోందని క్యాడర్ గగ్గోలు పెడుతున్నారు.. అసలు కంటే కొసరు ఎక్కువన్నట్లు అసలు అభ్యర్థి ఆయనా..లేకా ఈయనా..అని తలలు పట్టుకుంటున్నారట.. బాబోయ్ ఈయన సిత్రాలు చూడలేకపోతున్నాం గురూ.. కాస్త ఎవరైనా చెప్పండ్రా... అంటూ సైటర్లు వేస్తున్నారట.. ఇంతకీ ఎవరా నేత.. ఆయనకు పి.గన్నవరంతో సంబందం ఏంటి...? అసలు పి.గన్నవరంలో ఏం జరుగుతోంది.. మేజర్ న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనమిది... ఆయన అమలాపురం పురపాలక సంఘంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి.. స్థానిక అమాత్యుని అండదండలు మెండుగా ఉన్న నేత... ఈకారణంతోనే ఆయన్ను పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకునిగా నియమించింది వైసీపీ అధిష్టానం.. అమలాపురంలో అండదండలందించే మంత్రి పోటీలోనే ఉన్నారు.., కానీ ఆయన ఇక్కడ గాలి కొదిలి దృష్టంతా పి.గన్నవరంపైనే పెట్టారట...ఇది పార్టీకి ఏమాత్రం కలిసొచ్చే అంశం అయితే పరవాలేదు..కానీ లాభం కంటే ఈయన తీరుతో నష్టమే ఎదురవుతోందని తలలు పట్టుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది..అన్నింటా ఆయనే.. సన్మానాల్లోనూ సిత్రాలే.. ఎన్నికల వేళ సాధారణంగా నియోజకవర్గ అభ్యర్థి ఎక్కడికి వెళ్లిన ఆయన్ను సన్మానించడం, ఆయనకే పెద్దపీట వేయడం పరిపాటి.. ఆయనే ముందుండి నడిచి హామీలు ఇవ్వడం, వాగ్ధానాలు చేయడం, ప్రత్యర్ధిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం ఇవన్నీ సాధారణంగా కనిపించే అంశాలు.. కానీ పి.గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో కనిపిస్తోన్న సిత్రాలు భలే కామెడీగా కనిపిస్తున్నాయని సెట్కెర్లు వేస్తున్నారు కొందరు... అభ్యర్థి కంటే ఈయన్నే ఆకాశనకెత్తేయడం, అలా జరిగేలా పక్కా ఏర్పాట్లు చేయించుకోవడం క్యాడర్‌కు పెద్ద తలనొప్పిగా మారిందట.. ఇంకా దారుణం ఏంటంటే కొన్ని ప్రాంతాల్లో అసలు అభ్యర్ధిని పక్కన పెట్టి ఈయనే ఎమ్మెల్యే అభ్యర్థి అనుకుంటున్న కొందరు ఈయనతోనే అన్నీ చెప్పుకుంటున్నారట..దూరమవుతోన్న రెండు సామాజికవర్గ ఓట్లు.. సదరు పరిశీలకుని పెత్తనంతో పి.గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్‌లో రెండు సామాజిక వర్గంకు చెందిన ఓట్లు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. సదరు పరిశీలకుని సామాజికవర్గానికి చెందిన క్యాడర్‌లో ఇప్పటికే ఈయన వ్యవహారశ్కెలిపై గుర్రుగా ఉన్నారట.. అమలాపురంనుంచి వచ్చిన వలసనేత వల్ల ఓట్లు రాలతాయా అంటూ పెదవి విరుస్తున్నారట.. ఇదే పార్టీలో ఉంటున్న మరో సామాజికవర్గం కూడా ఇతన వ్యవహారశ్కెలికి అసహనం వ్యక్తం చేసి కార్యక్రమాలకు దూరం అవుతున్నారట.. ఇదే కొనసాగితే గెలిచే అవకాశాలున్న పి.గన్నవరం వైసీపీ సీటు కష్టాల్లో పడడం ఖాయమని పార్టీ క్యాడర్‌లోనే విమర్శలు వెల్లువెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది..

## అరాచకపాలనలో రాష్ట్ర భవిత అధోగతిపాలు

- కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు





**అమలాపురం/ముమ్మిడివరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో వైసీపీ అయిదేళ్ల అరాచకపాలన వల్ల రాష్ట్ర భవిష్యత్తు పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని, మళ్లీ రాష్ట్రానికి పూర్వవైభవం రావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ముమ్మిడివరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం, పోలేకుర్రు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమం ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావుతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సుబ్బరాజుకు అడుగడుగునా స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. స్థానికులుతో సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో నియోకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ సిమెంటు రోడ్లు , సీసీ డ్రైన్లు పూర్తిస్థాయిలో నిర్మించామని, అయితే వైసీపీ అయిదేళ్ల కాలంలో అభివృద్ధి అనేదే మర్చిపోయిందన్నారు. మండలంలోని శివారు ప్రాంతాల్లోని రైతులకు సాగునీటి ఇబ్బందులు తీర్చలేని దుస్థితిలో ఈ ఎమ్మెల్యే ఉన్నాడన్నారు. ప్రజలు ఇబ్బందులు గాలికొదిలి వివాదాలకు మాత్రం ఆజ్యం పోసే విధంగా ఈపాలకుల వ్యవహార శ్కెలిని ప్రజలు గమనించాలని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మేలు జరగాలంటే సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఇచ్చిన హామీలను ఖచ్చింతంగా నెరవేర్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే శాంతి భద్రతలు, అభివృద్ధి సాధ్యమని, కానీ వైసీపీ పాలనలో ఇవన్నీ ఆమడ దూరంలో నిలిచాయన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల సుబ్బరాజును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిలిస్తే పలికేంత దూరంలోఉండే సుబ్బరాజును గెలిపించుకోవడం ద్వారా ముమ్మిడివరం నియోజకవర్గం పూర్వవైభవం పొందుతుందన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ దేవరాయ కాలేజ్ కు ప్రధమస్థానం



**అమలాపురంచ మేజర్ న్యూస్ :** ఇంటర్ మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాలలో ముమ్మిడివరం శ్రీ కృష్ణ దేవరాయ మహిళా జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఫలితాలలో రెలింగి వీర వెంకట ప్రశాంతి ఎం.పి.సి గ్రూప్ నుండి 968/1000, మార్కులు సాధించగా, కాశీ సుధారాణి బై.పి.సి. గ్రూప్ నుండి 901/1000 మార్క్శు సాధించారు. ప్రధమ సవత్సరం ఫలితాలులో ఎం.పి.సి. గ్రూప్ నుండి మోటిపల్లి స్వర్ణంజలి 410/470, శీలం శ్రవని బై.పి.సి. గ్రూప్ నుండి 384/440 మార్కులు సాధించి ప్రధమ స్థానం సాధించారు. అలాగే వివాహం అయి తన పిల్లలు ఒకరు ఎనిమిదవ తరగతి, ఒకరు ఆరవ తరగతి ముమ్మిడివరం బాలాజీ కాన్వెంట్ లో చదువుచున్నప్పటికి చదువుపై మక్కువతో లంకే వెంకటలక్ష్మి కృష్ణ దేవరాయ మహిళా జూనియర్ కళాశాలలో హెచ్.ఇ.సి. లో గ్రూప్ నందు 814/1000 మార్క్ లు సాధించి నియోజకవర్గంలోనే ప్రధమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, జగత సురేష్, అధ్యాపకులు అభినందించారు.

## ఎన్నికల సిబ్బందికి శిక్షణ

- పర్యవేక్షించిన ఆర్‌ఓ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రానున్న సాధారణ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని కాకినాడ సిటీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జే వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు మాట్లాడుతూ తొలి విడత శుక్ర,శనివారాలలో రెండు రోజులపాటు పిఓ, ఏపిఓ లకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉండే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, చట్టపరమైన, సాంకేతిక పరమైన అంశాలు, ఈవీఎం, వివి ప్యాట్ల నిర్వహణ పై సమగ్ర శిక్షణ ఇచ్చి రానున్న ఎన్నికలకు సన్నద్ధం చేయడమే శిక్షణ ప్రధాన ఉద్దేశమన్నారు. రెండో విడత ఈనెల 15,16వ తేదీలలో ఓపిఓ లకు కూడా శిక్షణ ఉంటుందన్నారు. ఆయా తేదీలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని ఆర్వో చెప్పారు. సుమారు 3300 మందికి ఎన్నికల సిబ్బందికి ఈ శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసిల్దార్ చల్లన్న దొర, ఇతర అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సుమారు 30 మంది ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు.

## శ్రీ సత్యదేవుని సన్నిధిలో శ్రీరాములవారి కళ్యాణంకి ఏర్పాట్లు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి సన్నిధిలో కొలువై న సీతారామచంద్రమూర్తి ఆలయం వద్ద ఏప్రిల్ 17న జరిగే కల్యాణ ముహోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు వైదిక కమిటీల సూచనల మేరకు వేద పండితుల మంత్రోచ్ఛారణలు మధ్య పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ నేటి నుండి దేవస్థానం పై గల శ్రీరామచంద్రమూర్తి ఆలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయని, 17వ తేదీన అంగరంగ వైభవంగా శ్రీ రాముల వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపర్డెంట్ స్వామి, పిఆర్ఓ విభాగం గణపతి తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న కళ్యాణోత్సవాలపై సమీక్ష



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర ఆలయంలో కళ్యాణ మహోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళ్యాణోత్సవాలు నిర్వహించాలని కొత్తపేట రెవెన్యూ డివిజన్ అధికారి జి.వి. సత్యనారాయణ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. శుక్రవారం కళ్యాణోత్సవ ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏపీఎస్ఆర్టీసీ బస్ సర్వీస్ ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణపై పంచాయతీరాజ్ అధికారులను వైద్య శిబిరం ఏర్పాటుపై వైద్యశాఖ అధికారులతో పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్ల నిర్వహణలో పాటించవలసిన జాగ్రత్తల గురించి, ఆలయ సిబ్బంది పోలీస్ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. సమావేశంలో తాసిల్దార్, ఎండిఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదిగో..అదిగో తూర్పు భద్రాద్రి

### - 16న అంకురార్పణ
### - 17న సీతారామ కల్యాణం







**కాకినాడ,మేజర్న్యూస్ :** దేశంలోనే అతిపెద్ద గోపురాలు ఉన్న నాలుగవ ఆలయంగా, తూర్పు భద్రాద్రి గా విరాజిల్లుతోంది పెదపూడి మండలం గొల్లలమామిడాడలోని శ్రీకోదండరామ ఆలయం. ఈ ఆలయం శ్రీరామనవమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. వాస్తవానికి రాష్ట్రం విడిపోయినప్పుడు భద్రాచలం తెలంగాణలోకి వెళ్లడంతో గొల్లలమామిడాడ ఆలయాన్ని రాష్ట్ర సీతారామాలయంగా గుర్తించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అధికారులు పరిశీలించారు. అయితే అప్పట్లో కడపజిల్లాలోనిఒంటిమిట్టను వివిధకారణాలతో గుర్తించారు. ఇక గొల్లలమామిడాడలో జరిగే రాములోరి కళ్యాణం చూసేందుకు లక్ష మంది భక్తులు వస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా రావడంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రావడం సంప్రదాయం. ఈనేపథ్యంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ద్వారంపూడి శ్రీరామ మురళీకృష్ణ శ్రీనివాస్రెడ్డి సకల ఏర్పాట్లు పూర్తిచేశారు. 16వ తేదీన సాయంత్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అతిథులుగా ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ నివాస్, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, జిల్లా ఎస్పి సతీష్ కుమార్ తదితరులు విచ్చేస్తున్నారు. 16వ తేదీ ఐదు గంటలకు శ్రీరామ రక్షా దీక్ష ప్రారంభమవుతుంది. సాయంత్రం 6గంటలకు దీక్షధారణ, కైంకర్యాలు ఉంటాయి. 17వ తేదీ శ్రీరామనవమి రోజు తెల్లవారుజాము నుంచి భక్తులు పవిత్ర కోనేరులో స్నానాలాచరిస్తారు. కొందరు తలనీలాలు సమర్పిస్తారు. ఉదయం 6గంటల నుంచి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాంచరాత్ర ఆగమం ప్రకారం మధ్యాహ్నం 12గంటల30నిమిషాలకుసీతారామ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. పూర్తి సంప్రదాయంతో చలువ పందిళ్లలో, ముత్యాల తలంబ్రాలతో,కర్పూరదివిటీలతో వంశపారం పర్యంగా వచ్చే ధర్మకర్త దంపతులు పెళ్లి పెద్దలుగా ఈ కళ్యాణం నిర్వహించనున్నారు . సాయంత్రం జరిగే స్వామి అమ్మవార్ల రథోత్సవ కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని రథం లాగేందుకు పోటీపడతారు. 18వ తేదీన తీర్థ గోష్ఠి, 19వ తేదీన విశేష తులసి, కుంకుమార్చనలు 20తేదీన శేషవాహనంపైస్వామివారి గ్రామోత్సవం ,21న పుష్కరిణివద్దవసంతోత్సవం, 22న శ్రీపుష్పయాగం కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. కనివిని ఎరిగిన రీతిలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు స్నానాలాచరించి దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ,అదేవిధంగా తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు జరుగుతోంది. భద్రాచలం తరువాత అటు కడప జిల్లాలోని ఒంటిమిట్ట, ఇటు కాకినాడ జిల్లాలోని గొల్లలమామిడాడ ఈ మూడు ఆలయాల్లోనే శ్రీరామనవమి చూసి తరిస్తారు భక్తులు. ఇక్కడ వెలిసిన కోదండరాముడికి ఒక విశిష్టత ఉంది. వివాహమై పిల్లలు కలగని దంపతులు స్వామివారిని మొక్కుకుని కళ్యాణం తరువాత ముత్యాల తలంబ్రాలు తీసుకుని వెళ్తే వారికి పిల్లలు పుడతారు. అలా పుట్టిన పిల్లలను తీసుకొచ్చి రాములవారికి ఇచ్చేస్తారు .తర్వాత కొంత మొత్తాన్ని రాములవారికి ఇచ్చి రాముల వారిచ్చిన సంతానంగా వారిని తిరిగి స్వీకరిస్తారు. అదేవిధంగా వివాహం కాని అవివాహితులు కూడా ఈ కల్యాణ తలంబ్రాలు ధరిస్తే వివాహం అవుతుంది అన్న ఒక సెంటిమెంట్ ఉంది. లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. ఆ పైబడి వచ్చినా వారందరికీ అల్పాహారం, అన్నదానం ఉంటుందని ధర్మకర్త వెల్లడించారు. సీతారాముల కళ్యాణం.. చూసొద్దాం రండి అంటూ ఇప్పటినుంచే భక్తులు ఏర్పాట్లు చూసేందుకు రాములోరి దర్శనానికి తరలివస్తున్నారు. ఇప్పటికే జాయింట్ కమిషనర్ విజయరాజు ఆలయాన్ని సందర్శించారు. ధర్మకర్తను సత్కరించారు.

## నాసిరకం మద్యంతో లక్షల కోట్లు దోచుకున్నారు

### - రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు బండారు



**ఆత్రేయపురం,మేజర్ న్యూస్ :** మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి నకిలీ జే బ్రాండ్ల అమ్మకాల ద్వారా దోచుకున్న డబ్బును ఎన్నికలలో పంచేందుకు వైఎస్ఆర్సిపి నాయకులు కంటైనర్ లతో తరలిస్తున్నారని కొత్తపేట నియోజక వర్గం ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు ఆరోపించారు. గురువారం ఆత్రేయపురం మండలం గ్రామంలో ప్రజా బలం కార్యక్రమనికి విశేష స్పందన లభించింది ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థులుగా కొత్తపేట నియోజకవర్గం నుంచి బండారు సత్యానందరావు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గంటి హరీష్ మాధుర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను ఇంటింటా తిరిగి కోరారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మద్యనిషేధం పేరుతో జగన్ లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దోచుకోవడం కోసమే మద్యం దుకాణాల వద్ద డిజిటల్ పేమెంట్లు లేకుండా చేశారని అన్నారు. గతంలో మద్యం ఎలుకలు తాగేశాయన్న వార్తలు కూడా దోపిడీలో భాగమే అని తెలిపారు. మద్యనిషేధం అని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. జగన్ సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డి మద్యం వ్యాపారంలో ఆరితేరి ఉన్నారని ఇటీవల వింటున్న లిక్కర్ స్కామ్ కంటే పెద్ద స్కామ్ ఆంధ్రప్రదేశ్ లో ఉందని అన్నారు. జె బ్రాండ్ల కల్తీ మద్యం అమ్మకాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం వల్ల అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. మద్యంలో దోచుకున్న డబ్బును ఎన్నికలలో పంచేందుకు ఇటీవల కంటైనర్ద్వారాతరలించారని సత్యానందరావు అన్నారు. అంకంపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుడప కృష్ణమూర్తి, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం, ముత్తాబత్తుల రాజు,మెర్ల రాము, కప్పల సునీల్ మొదలగువారు పాల్గొన్నారు.

## ఏప్రియల్ 14వ తేదీన డా. బి.అర్.అంబేడ్కర్ జయంతి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏప్రియల్ 14వ తేదీన డా. బి.అర్.అంబేద్కర్ జయంతిని నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీన ఉదయం 10.00 గంటలకు కాకినాడ ఇంద్రపాలెం లాకుల కూడలి వద్ద గల డా. బి.అర్. అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి డా. బి.అర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. నివాస్ కోరారు.

## 14న టీడీపీ కార్యకర్తలు భారీగా పాల్గొనాలి

### - దాట్ల పృధ్విరాజు



**అమలాపురం/ముమ్మిడివరం, మేజర్ న్యూస్ :** ఈనెల 14వ తారీఖున ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొనాలని దాట్ల పృథ్విరాజ్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 20 వార్డుల నాయకులు కార్యకర్తలు, వార్డు ఇన్చార్జిలు, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జిలు కు ఈరోజు ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం దొమ్మేటి రమణ కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేయడమైనది.

ఈ సమావేశంలో ముమ్మిడివరం నగర పంచాయతీ టిడిపి ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఈనెల 14న తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు గారు 8,9,12,13,14,15 వార్డులలో ఎన్నికల ప్రచారం జరుగుతున్నందున వార్డులలోని ప్రజలందరినీ ప్రచారంలో పాల్గొనేలా చూడాలని, బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం నగర పంచాయతీ పరిధిలో లేని రోజుల్లో ప్రతి వార్డులోని వార్డు కమిటీ ప్రచార కమిటీని ఎన్నుకొని లోకల్ నాయకులతో ఇంటింటా పార్టీ ప్రచారం చేయాలని బాలకృష్ణ అన్నారు. మరియొక అతిథి పృథ్వీరాజ్ మాట్లాడుతూ చంద్రబాబు గారు పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను మరియు ఏప్రిల్ నెల నుండి వృద్ధులకు 4000 పెన్షన్ వికలాంగులకు 6000 పెన్షన్ తదితర పథకాలను వార్డుల్లోని ప్రజలందరికీ వివరించాలని ప్రతి వార్డులను వార్డు కమిటీలో జనసేన నాయకులును కలుపుకొని ప్రజలందరినీ ప్రత్యేకంగా కలవాలని అన్నారు. నగర పంచాయతీలో జరిగే ప్రచార కార్యక్రమాలను జయప్రదం చేయాలని పృథ్వీరాజ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్, అర్థాన్ని శ్రీనివాసరావు, కడలి సౌజన్య నాగు, కట్ట సత్తిబాబు, తాడి నరసింహారావు, అడబాల సతీష్ కుమార్, విత్తనాల ధనంజయ్, విళ్ల వీరస్వామి నాయుడు, పిల్లి నాగరాజు, పితాని నరసింహామూర్తి, రెడ్డి సుధీర్, లోకనీడి వెంకటేశ్వరరావు, పాయసం చిన్ని, మాదాల పరంకుసం, గొల్లపల్లి గోపి, రెడ్డి సుబ్బారావు, రెడ్డి శ్రీను, చింత క్రింద రామకృష్ణ, కాశి రామచంద్రరావు, కాశి లాజర్, మెండి రాజశేఖర్, బొక్క రుక్మిణి, వాసంశెట్టి అమ్మజి, పెదపూడి రుక్మిణి, కుడిపూడి మల్లేశ్వరి, గొంతు శ్రీరాములు, సరిపెల్ల నాగరాజు, రాయుడు సుందరం, వాసు రాజు, చింతపల్లి రాజు, కె.వి.ఆర్ శ్రీను, ఎలమంచిలి రాజా, సానబోయిన సోమయ్య, ఎస్ఎంఎస్ ప్రసాద్, సాన బోయిన చంటి, షేక్ హుస్సేన్, బడుగు సందీప్ సాయి, నడింపల్లి కుమార్, వడ్డీ సత్తిబాబు, మట్టపర్తి సత్యనారాయణ, దువ్వూరి రామకృష్ణ, ఆకొండి రామకృష్ణ, సిద్దిన బాబు, చప్పిడి దుర్గాప్రసాద్, గంజా వెంకటేశ్వరరావు, దోనబోయిన నాగేశ్వరరావు, గద్దం శ్రీనివాసరావు, ఎల్లమల్లి వెంకటేశ్వరరావు, సరిపెల్ల శ్రీను రాజు, శీలం పండు, ఏడిద శివ సత్యనారాయణ, రెడ్డి బాలకృష్ణ, జాగు సత్తిబాబు, కంచర్ల సురేష్, దోనబోయిన రామ్ కిరణ్, దాట్ల బాబు, నడింపల్లి శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటా

### - మంత్రి పినిపే విశ్వరూప్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** నామినేషన్లుకు ఇంకా పదిరోజుల సమయం ఉంది..విశ్వరూప్ వంద రూపాయలు లంచం తీసుకున్నాడని నిరూపిస్తే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటానని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఆనందరావు స్థాయి వ్యక్తి స్లిప్ రాసిస్తే దాన్ని చంద్రబాబు చదివారని, ఓ ప్రతిపక్ష నేతగా.. సీనియర్ నేతగా మాట్లాడే హక్కు ఉందని కానీ ఆలోచించి, పరిశోధించి మాట్లాడాలన్నారు. ఏవిధమైన వాస్తవాలు లేని విషయాన్ని తీసుకుని తనపై బురద చల్లాలనుకుంటే ఆకాశంమీద ఉమ్మివేసినట్లేనన్నారు. ఆనందరావు తనకున్న అలవాట్లును నాపై రుద్దుతున్నారనుకుంటున్నాన న్నారు. ఇంటి స్థలాలకోసం సేకరించిన భూములకు సంబందించి ఏ యజమాని దగ్గరకైనా వెళ్లి తెలుసుకోవాలని, అవినీతికి పాల్పడ్డట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలనుంచి తప్పుకుంటున్నానన్నారు. పోటీనుంచి వెంటనే తప్పుకుంటానన్నారు. మున్సిపల్ కార్యాలయ స్థలాన్ని తన అనుచరులకు ఇచ్చి కట్టిస్తున్నాన్న ఆరోపణలు అవాస్తవం అన్నారు. రూ. 3.5 కోట్లు పనులు నామినేషన్కింద ఇవ్వడం కుదరదని, టెండర్లు ద్వారా దక్కించుకున్న పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా చేపల చెరువులు తవ్వితే లంచాలు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు చేశారని, అది ఆనందరావుకే అలవాటు అన్నారు. చౌకబారు ఆరోపణలు చేయడం పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు సరికాదన్నారు. పదేళ్లపాటు మంత్రిగా పనిచేశానని, ఏనాడు వ్యక్తిగతమైన విమర్శలు చేయలేదని, కానీ సిద్ధాంతపరంగా విమర్శిస్తానన్నారు.

**చంద్రబాబు ఆత్మవిమర్శ చేసుకోవాలి..** అమలాపురం అల్లర్ల విషయంలో మరో కాశ్మీర్గా కోనసీమను చేశారన్న విమర్శలకు చంద్రబాబు ఆత్మవిమర్శ చేసుకోవాలని విశ్వరూప్ కోరారు. అల్లర్లకు కారణమైన వ్యక్తులు ఎక్కడ ఉన్నారో, ఏ పార్టీ తరపున పోటీలో ఉన్నాడో చంద్రబాబు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. అల్లర్ల కేసు జాతీయ విషయం అయ్యాక నిందితుల అరెస్ట్ విషయంలో వీడియోల్లో కనిపించిన అమాయకులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని ఆనాడే చెప్పానని, కోనసీమ ప్రజలు విజ్ఞులని, అంబేద్కర్ పేరు జిల్లాకు పెట్టినంతమాత్రాన ఇళ్లు తగలబెట్టే సంస్కార హీనులు కాదని, కేవలం కొందరు చేసిన పనిని కోనసీమ ప్రజలకు ఆపాదించడం సరికాదన్నారు. గతంలో బాలయోగి, బత్తెన సుబ్బారావులాంటి నేతలను చూశామని, రాజకీయాలకోసం చౌకబారు ఆరోపణలు చేసే పరిస్థితి లేదన్నారు.

**విశ్వరూప్ మంచి చేసే వైరస్ ...** విశ్వరూప్ కోనసీమకు వైరస్లాంటోడని చంద్రబాబు అన్నట్లు కొన్ని పత్రికల్లో చూశానని, వైరస్లో రెండు రకాలుంటాయని, అందులో మంచిచేసేది ఉంటుంది, చెడ్డ చేసేది ఉంటుందని, విశ్వరూప్ అనే వ్యక్తి కోనసీమకు మంచిచేసే వైరస్ తప్ప చెడు చేసేవాడు కాదన్నారు

**అమలాపురంలో పార్టీల మధ్య యుద్ధం కాదు...** అమలాపురంలో విశ్వరూప్ క్యారెక్టర్కు ఆనందరావు క్యారెక్టర్కు మధ్య జరిగే యుద్ధం ఇదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజల తీర్పు ఇవ్వనున్నారని, జూన్ 4న ప్రజలు ఇచ్చే తీర్పులో ఎవరు ఏమిటో తేలనుందన్నారు. మండుటెండలో సైతం జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అమలాపురం మీటింగ్ విఫలం అవ్వడం వల్లనే ఫ్రస్టేషన్లో ఉన్నారేమో అన్నారు. విమర్శలకు ప్రతి విమర్శ చేయడం తన నైజం కాదని, కానీ ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకుని చేయాలని, ఆనందరావు స్థాయి నాయకులు ఏదో స్లిప్ రాసిస్తే దాన్ని చదవడం సరికాదన్నారు. తనపై ఆరోపణలు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలనుంచి వైదొలుగుతానని పునరుద్ఘాటించారు.

## మన కాకినాడను రాష్ట్రంలోని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుదాం

### - ఎన్నికల ప్రచార సభలో వనమాడి కొండబాబు





**కాకినాడ,మేజర్న్యూస్ :** వైసిపి ఐదేళ్ల మోసపూరిత పాలనలో కుంటుపడిన నగర అభివృద్ధిని రాబోయే తెలుగుదేశం-జనసేన-బీజెపి కూటమి ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారాలతో మన కాకినాడను రాష్ట్రంలోని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం-జనసేన-బీజెపి కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 12 వ డివిజన్ పర్లోవపేట నందు ఎన్నికల ప్రచార బహిరంగ సభ నిర్వహించారు. వైసీపీ పార్టీ నుండి దిబ్బాడ పెద్దబాబు, చింతపిల్లి లక్ష్మి, చింతపిల్లి అప్పారావు, నొల్లి సింహాచలం, పోలరాజు వారి అనుచరులు సుమారు 200 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మోసపూరిత మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కాకినాడ నగరం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, పన్నుల రూపంలో కాకినాడ నగర ప్రజల కార్పొరేషన్ కు చెల్లించిన నిధులను, స్మార్ట్ సిటీ నిధులను కూడా దోచుకుని కాకినాడ కార్పొరేషన్ దివాలా తీసే పరిస్థితికి కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి తీసుకువచ్చాడని, కాకినాడ నగర ప్రజలకు ఐదేళ్ల కాలంగా అందవలసిన చమురు నిక్షేపాల నష్టపరిహార నిధులను కూడా దోచేసారని, దేశంలోనే పారడైజ్ సిటీగా ప్రశాంత వాతావరణ గల నగరంగా పేరు ప్రఖ్యాతలు పొందిన నగరాన్ని నేడు ఎమ్మెల్యే ద్వారంపూడి తన అక్రమ సంపాదన కోసం డ్రగ్స్, గంజాయి, పేకాట క్లబ్బులు, క్రికెట్ బెట్టింగులు, బ్లేడ్ బ్యాచ్ లకు, రౌడీలు గుండాల ముఠాలకు అడ్డాగా కాకినాడ నగరాన్ని మార్చేసి కాకినాడ నగర ప్రతిష్టను నాశనం చేశారని, ఈ అరాచక పాలన నుండి కాకినాడ నగరానికి విముక్తి కలగాలంటే రాబోయే ఎన్నికల్లో కాకినాడ నగర ప్రజలు తమ పవిత్రమైన ఓటును సైకిల్ మరియు గ్లాస్ గుర్తులపై వేసి అసెంబ్లీ పార్లమెంట్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి మన కాకినాడను మనం కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్, డివిజన్ నాయకులు తుమ్మల సునీత, తుమ్మల రమేష్, పేకేటి భాస్కరరావు, ఒమ్మి బాలాజీ, కొక్కిలగడ్డ గంగరాజు, తుమ్మల కొండలరావు, రాగిత సత్తిబాబు, బాసి రమణారెడ్డి, జనసేన డివిజన్ నాయకులు దూడ తాతారావు, తాడి రమణ, కసింకోట చంద్రశేఖర్, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ పెద్దబాబు, చింతపిల్లి అప్పారావు, పొట్టి పోలయ్య, కాసారపు సింహాద్రి, దేగల సాయిబాబా, నొల్లి బుగ్గియ్య, నిమ్మగడ్డ జగదీష్, ఆకాష్, శివ, తిరిది ఎల్లయమ్మ, నిద్రబింగి సత్తిబాబు, సూర్య కుమారి, కుమారి, జ్యోతి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయ దుందుబి మోగించిన శ్రీ చైతన్య విద్యాసంస్థలు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ రెండవ లెవెల్ పరీక్ష ఫలితాలలో అమలాపురం శ్రీ చైతన్య విద్యార్థులు విజయ దుందుభి మోగించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ఎం.వి.సురేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐ.ఎన్.టి.ఎస్.ఓ. సెకండ్ లెవెల్లో గ్రాండ్ ప్రైజ్ సాధించిన సూర్య సాత్విక్ కు లాప్టాప్, ఫస్ట్ ప్రైజ్ సాధించిన జ్ఞాన జోషిత మరియు సాహిత్య వర్ధనిలకు టాబ్ లను వారి చేతుల మీదుగా అందజేశారు. స్థానిక శ్రీ చైతన్య స్కూలు, అమలాపురం బ్రాంచ్ల నుండి ఒక లాప్టాప్, రెండు టాబ్లను, మూడో బహుమతిముగ్గురు విద్యార్థులు, నాలుగవ బహుమతి ఇద్దరు విద్యార్థులు, 5వ బహుమతి ఐదుగురు విద్యార్థులు, స్పెషల్ ప్రైజు ఇద్దరు విద్యార్థులు, కన్సోలేషన్ ప్రైజులు 62, గోల్డ్ మెడల్స్ 154 మంది విద్యార్థులు సాధించారని తెలియజేశారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులను ఏజీఎం సురేష్, ఆర్ఐ శ్రీనివాస్, జోనల్ కోఆర్డినేటర్ వి.వి.శ్రీకాంత్ ,ప్రిన్సిపాల్వాసు,శ్రీనివాసులు అభినందనలు తెలియజేశారు. కార్యదక్షత, ఏకాగ్రత మరియు అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడం వలన ఇంతటి ఘనవిజయం సాధ్యమైందని, ఈ విజయానికి తగిన తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు, ఇన్చార్జులు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సమక్షంలో టీడీపిలో చేరిక



**అమలాపురం,మేజర్న్యూస్ :** మండలంలో బండారులంక గ్రామ సర్పంచ్ వైసీపీ నాయకురాలు పెనుమాల సునీత ఏడుకొండలు చంద్రబాబు నాయుడు సమక్షంలో శుక్రవారం టీడీపీలో జాయిన్ అయ్యారు. ఆమెతో పాటు బండారులంకకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

## శ్రీ వన దుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హెూమం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైనఅన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హెూమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గ అమ్మవారిని వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెూమం నిర్వహించిన భక్తులకు వేద పండితులు వేద ఆశీర్వచనం గావించి, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, ఐ.వి.రామారావు, దేవస్థానం అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసిన శ్రీ శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి సిహెచ్ రామ మోహన్ రావు పర్యవేక్షణలో అమ్మవారికి బంగారు, పుష్పాలతో మరియు వెండి పుష్పాలతో అర్చన వేద పండితుల ఆధ్వర్యంలో పుష్పార్చన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవస్థానం సిబ్బంది, వేద పండితులు, ఆసాధులు, ప్రసాద్, లోవ,వరహాలు,క్రాంతి, శివ,సురేష్ పాల్గొన్నారు

# జనసేనలో చేరిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పేరుబాబు

- భారీ ఊరేగింపుగా తరలి వచ్చిన బ్రాహ్మణులు

- బ్రాహ్మణులకు మేలు చేసింది

చంద్రబాబు - పేరు బాబు



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీలోనికి వివిధ కులాకు చెందిన నేతలు పార్టీ సభ్యత్వాలు తీసుకోవడానికి తరలి వస్తున్నారు. రెండు రోజుల క్రితం బ్రాహ్మణ సేవా సంఘ కార్పోరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసిన దినవాహి పేరాజు (పేరుబాబు) కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్ధి పంతం నానాజీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాన్ని శుక్రవారం స్వీకరించారు. ఆయన వెంట మరో 20 మంది పార్టీలోకి చేరడం విశేషం. దీంతో పాటు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ మానేపల్లి బాబ్జీ కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చిన తర్వాత బ్రాహ్మణ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. పేద బ్రాహ్మణులకు అందాల్సిన పథకాలు అందకుండా పోయాయన్నారు. ఇటీవల అర్చకులు, పురోహితులపై అధికార పార్టీ నేతలు దాడులు చేయడం దురదృష్టకరమన్నారు. బ్రాహ్మణ సంఘాలు పవన్ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి జనసేన వైపు మొగ్గు చూపి రాష్ట్ర స్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నారని, బ్రాహ్మణులు జనసేన వెంట రావడం, వారి ఆశీర్వచనాలు మా విజయానికి సోపానాలన్నారు. పేరుబాబు మాట్లాడుతూ నానాజీ 20ఏళ్ళ మిత్రుడన్నారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయడం జరిగిందన్నారు. వైఎస్‌లాగే జగన్ కూడా ప్రజా సంక్షేమమం, బ్రాహ్మణ సంఘాల సమస్యలు పరిష్కరిస్తారని ఎంతో ఆశించామని, దానిని నీరుగార్చారన్నారు. చంద్రబాబు కార్పోరేషన్ ఏర్పాటు చేసి 13రకాల పథకాలను అమలు చేశారన్నారు. పేద బ్రాహ్మణులకు ఈ పథకాలు ఊరటనిచ్చాయన్నారు. వేదం చదువుకునే బ్రాహ్మణులకు ఆర్ధిక సహాయాన్ని ఆందించేవారన్నారు. విదేశి విద్యకు 10లక్షలు అందించేవారన్నారు. జగన్ అధికారంలోనికి రాగానే వాటిని రద్దు చేయడంతో చాలా మంది బ్రాహ్మణులు అప్పుల పాలయ్యారన్నారు. పవన్ మొట్టమొదటిగా నెల్లి మర్లలో బ్రాహ్మణ మహిళకు అసెంబ్లీ టికెట్ కేటాయించారని, సంఘం తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అధికారంలోనికి రాగానే అన్ని పథకాలు అమలవుతాయని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. కూటమి విజయానికి పూర్తి స్థాయిలో కృషి చేసి విజయం సాధించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రేపటినుండే మండలంలో పర్యటించి బ్రాహ్మణ ఓట్లు జనసేనకు పూర్తిస్థాయిలో పడే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెలిశెట్టి ప్రసాద్, అడ్డాల సూర్యానారాయణ, రేపాక సర్వేస్వరరావు, దినవాహి వెంకట్రాజు, తురగా సంతోష్, దుర్గా ప్రసాద్, శర్మ, పుల్లా శ్రీరాములు, పుల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు. ముందుగా సర్పవరం గ్రామంనుండి బారీ స్థాయిలో జనసేన కార్యాలయానికి తరలి వచ్చారు.

**నానాజీతో మాట్లాడిన రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దుర్గా ప్రసాద్ :** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు సత్యవాడ దుర్గా ప్రసాద్ రూరల్ కూటమి అభ్యర్ధి పంతం నానాజీతో ఫోన్‌లో మాట్లాడారు. బ్రాహ్మణుల మద్దతు పూర్తి స్థాయిలో జనసేన పార్టీకి ఉంటుందన్నారు. అదే విధంగా కాకినాడ రూరల్‌లో త్వరలో తాను పర్యటించి సంఘాల మద్దతును అందించడం జరుగుతుందన్నారు. పేరబాబు పార్టీలో చేరిన వెంటనే దుర్గా ప్రసాద్‌కు తెలియజేయడం జరిగింది. నానాజీతో మాట్లాడుతాననగానే పేరుబాబు ఫోన్‌లో వీరద్దరినీ కలపడం జరిపింది. బ్రాహ్మణులకు తగిన సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. బ్రాహ్మణులపై దాడులు చేస్తే ఊరికునేది లేదని నానాజీ స్పష్టం చేశారు.

## అగ్ని బాధిత కుటుంబాలకు ఆశ్రమ పాఠశాల సిబ్బంది వంట సామాగ్రి వితరణ



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని ఏజీ కోడేరు పంచాయితీ పరిధిలో మల్లేతోట గ్రామంలోని గత నెల 28న పాఠశాల వెనుక గల కాకవారి గుంపుకు చెందిన ఐదు కుటుంబాల ఇళ్లు అగ్ని ఆహుతి అయిన విషయం తెలిసిందే. సర్వస్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులను మల్లెతోట ఆశ్రమ పాఠశాల సిబ్బంది శుక్రవారం పరామర్శించడం జరిగింది. బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి బియ్యం, వంట సామాగ్రి, గరిటేలు, ప్లేట్లు, దుప్పట్లుతోపాటు స్త్రీలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారం చంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పూరి బీమ్మయ్య, భూమిరెడ్డి, ఆదినారాయణ, కన్నారావు, ప్రేమకుమారి, భార్గవి, సీత, సురేష్, వీర్రాజు, రామదాసు, శ్రీనివాసు, సత్యనారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వీప్ ప్రోగ్రాం పై అవగాహన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిధిలో గల ఆర్బి పట్నం గ్రామంలో శుక్రవారం పెద్దాపురం ఎంపీడీవో ఎం ఉషారాణి స్వీప్ ప్రోగ్రాం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, అలాగే ఓటింగ్ శాతంను పెంచాలని, ఓటరు నమోదు పై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఫణికుమార్ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన నిత్యవసర ధరలతో ప్రజలు ఎలా బ్రతికేది..?

-జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు ఎన్నడూ చూడని విధంగా కొత్త కొత్త పన్నులు పుట్టుకొచ్చాయని, దానికి తోడు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు ఎవరూ ఈ వైసీపీ ప్రభుత్వంలో బ్రతకలేక ఇబ్బందులకు గురయ్యారని నెహ్రూ కుమార్తె తోట సునీత అన్నారు. గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించిన ఆమె తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి అయిన జ్యోతుల నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని తోట సునీత ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రజలకు గుదిబండలా మారాడని, సామాన్యులు హడలెత్తిపోయే విధంగా పన్నుల భారం మోపి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆమె అన్నారు. కందిపప్పు, చింతపండు, మంచి నూనె ఇలా ప్రతీ వస్తువుపై పన్ను వేసి సామాన్య ప్రజలపై అధిక భారాన్ని మోపిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆమె తెలియజేశారు. వైసిపి పాలనలో చెత్త పై కూడా పన్ను వేసి ప్రజల వద్ద నుంచి ఈ విధంగా కూడా డబ్బులు వసూలు చేయొచ్చని కొత్తరకం విధానాన్ని తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని సునీత అన్నారు. ఇచ్చింది గోరంత దోచుకున్నది కొండంత్తని ప్రజలకు అర్థమైందని ఇక జగన్మోహన్ రెడ్డి ఇంటికేనని ఆమె తెలిపారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి మేనిఫెస్టోని ప్రజలకు వివరిస్తూ వారి యొక్క కష్టసుఖాలు తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో తోట సర్వారాయుడు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల సత్యమూర్తి, మండపాక శ్రీ బాబు, పిండి బుజ్జి, ఎర్రంపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అని పాస్టర్ రాజాజీ మాజీ మంత్రి ఎమ్మెల్యే కన్నబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్థానిక వైద్య నగర్ కాకినాడ రూరల్ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు క్యాంప్ కార్యాలయంలో కాకినాడ గోడారిగుంట మూడో డివిజన్ కి చెందిన క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ రాజాజీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కన్నబాబు సాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛంతో ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డీ మణికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన క్రైస్తవ సంఘ కాపరులతో పాస్టర్ రాజాజీ మాట్లాడుతూ శకుంతనపురి కాలనీలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, దానికి 40 గజాల స్థలాన్ని కన్నబాబు అడగడంతో ఆయన మీద అభిమానంతో స్థలం ఇవ్వడం జరిగిందని, భవిష్యత్తులో ఈ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయడం ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఇది అంతా ఎమ్మెల్యే కన్నబాబు కృషి ఫలితమేనని ఆనందం వ్యక్తం చేశారు. కన్నబాబు మంచి వ్యక్తిత్వం గల నాయకుడని, అలాంటి వ్యక్తిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గంగారిన్, బీసీ సెల్ నాయకులు మాదబోయిన నేరేళ్ళు,పెద్ద ఎత్తున సంఘ కాపరులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## టోఫెల్ పరీక్ష విధానాన్ని పరిశీలించిన డీఈవో పి. రమేష్



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్ తనిఖీ లో భాగంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల , పెద్దాపురం ను సందర్శించి సమ్మేటివ్ అసెస్మెంట్ -2 పరీక్షలలో భాగంగా శుక్రవారం జరిగిన టోఫెల్ పరీక్ష జరుగుతుండుగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.అనంతరం మండల విద్యా శాఖా కార్యాలయమును సందర్శించి, మండలంలోని నాడు నేడు పనులపై సమీక్ష జరి పారు. ఈ నెలాఖరులోపు అన్ని పనులను పూర్తి చేయాలనీ ఆదేశించారు . ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల విద్యా శాఖాధికారి -1 ఈ ప్రభాకర శర్మ పాల్గొన్నారు.

## పి ఓ, ఏపీవోలుకు శిక్షణ తరగతులు

-పర్యవేక్షించిన ఆర్వో సీతారామారావు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రానున్న సాధారణ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పెద్దాపురం నియోజవర్గ రిటర్నింగ్ అధికారి జే. సీతారామారావు పేర్కొన్నారు. స్థానిక లూథరన్ హై స్కూల్ ఆవరణలో ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జె. సీతారామారావు మాట్లాడుతూ తొలి విడత శుక్ర,శనివారాలలో రెండు రోజులపాటు పిఓ, ఏపిఓ లకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉండే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, చట్టపరమైన, సాంకేతిక పరమైన అంశాలు, ఈవీఎం, వివి ప్యాట్ల నిర్వహణ పై సమగ్ర శిక్షణ ఇచ్చి రానున్న ఎన్నికలకు సన్నద్ధం చేయడమే శిక్షణ ప్రధాన ఉద్దేశమన్నారు.రెండో విడత ఈనెల 15,16వ తేదీలలో ఓపిఓ లకు కూడా శిక్షణ ఉంటుందన్నారు. ఆయా తేదీలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని ఆర్వో తెలిపారు. సమావేశంలో అధికారులు, తహసిల్దార్ ఎస్ శ్రీనివాస్ రెడ్డ ఇతర అధికారులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఎల్ అనూషరాయ్, వంశి వైద్య సిబ్బంది తదితరులు శిక్షణ కార్యక్రమంలో వైద్య సేవలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఉద్యోగస్తులకు పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఇంటర్ పరీక్షల్లో కెఎస్ఎన్ ప్రభంజనం



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** తాజాగా విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కెఎస్ఎన్, కళాశాలలవిద్యార్థులు అత్యంత ప్రతిభను. కనబరిచి ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు అత్యుత్తమ ప్రతిభను కనపరచిన విద్యార్థులనుకళాశాలలయాజమాన్యాలు అభినందించారు. ఈసందర్భంగాకెఎస్ఎన్‌ప్రిన్సిపాల్‌ఆర్.రాధాకృష్ణ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు గానూ పి తులసి 986, ఎస్ విశిష్ట 982,ఎస్‌దివ్య,జితన్శ్రీ,ఆర్‌బాలగనిలక్ష్మి, బిఅరుణ్ కుమార్‌లు 980చొప్పున సాధించినట్టు చెప్పారు. అలాగే జూనియర్ ఇంటర్లో 470 మార్కులకు గానూ ఎస్ సౌమ్యసుశీల, జిరాజా త్రిలోకేష్ లు 463 మార్కులు, డిలక్ష్మి సౌమ్య 462, పి జయశ్రీ 461 మార్కులు సాధించినట్టు చెప్పారు. కాగా ఈ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ శ్రీను, ఏవో వెంకటేశ్వరరావులు ఘనంగా అభినందించారు. అలాగే ప్రగతి కళాశాలలో జూనియర్ ఇంటర్ లో ఎన్ సాయి రత్నం (బైపిసి)434,ఎంసూర్యవర్షిణి(ఎంపిసి) 463లతో పాటు ఇద్దరు విద్యార్థులు462,మరో ఆరుగురు విద్యార్థులు 461మార్కులు సాధించినట్టు కళాశాలల చైర్మన్ నూతలపాటి పూర్ణ చంద్రరావు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల ఎజీఎం ఎస్ అనీల్ బాబు, ఎవోసిహెచ్‌ఆర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్‌జినాగబాబులు ఘనంగా అభినందించారు.

# నేటి నుండి బృహతి సహస్ర యాగం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుండి రెండు రోజులు పాటు బృహతి సహస్ర యాగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మద్యసభ కమిటీ ఏర్పడి సుమారు 147 సంవత్సరాలు కావస్తోంది. ఇంత చరిత్ర కలిగిన కమిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ హెూమాన్ని సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ స్వీయ పర్యవేక్షణలో ఈ హెూమాధి కార్యక్రమాలు నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. ఎంతో పవిత్రమైన చైత్రమాసంలో ఈ హెూమాధి కార్యక్రమం నిర్వహించడమే కాక వసంత పంచమితోపాటు మేష సంక్రమణ పర్వదినం కూడా కలిసి రావడం గొప్ప విషయము. హెూమాన్ని నిర్వహించాలన్న ఆశయంతో గత మూడు సంవత్సరాలుగా కమిటీ చేస్తున్న కృషికి భగవంతుడు అపూర్వమైన చైత్రమాసాన్ని ఎంపిక చేయడం ద్వారా మూల రామదేవులను అర్చిస్తున్న ఉత్తరాది మఠాధిప తులు సత్యాత్మ తీర్థ స్వామీజీ అనుగ్రహం కూడా పూర్తిగా లభించిందని భావించవచ్చును. ఈ హెూమ ప్రత్యేక ఆహ్వాన పత్రికను స్వామీజీ స్వయంగా ఆవిష్కరించడం ద్వారా హెూమ సంకల్పం చేసిన కమిటీ అధ్యక్షులు రాజులు రాఘవేంద్ర స్వామి, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు తోపాటు సభ్యులందరికీ మనోవాంఛ నెరవేరడమే కాక మరికొద్ది రోజులలో శ్రీరామనవమి రావడం కూడా శుభసూచికంగా అందరూ భావిస్తున్నారు. శనివారం నాడు ఈ యాగాన్ని ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సంకల్ప పూర్వకంగా ప్రారంభిస్తున్నారు. కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపెళ్ళ శేషగిరిరావు సంయుక్తా ఆధ్వర్యంలో మాధ్వ గృహస్తులు అందరూ భక్తి భావంతో ఏర్పాట్లకు సహకరించడం ఉత్తరాది మఠాధిప తులు సత్యాత్మ తీర్థ స్వామీజీ గురువుల పట్ల ఉన్న భక్తి భావాన్ని చాటుతోంది. ఈ బృహతి సహస్ర యాగం ద్వారా ఆయుష్య అభివృద్ధితోపాటు కామ్య కర్మలను కూడా ఫలవంతం చేసే భాగ్యాన్ని కల్పిస్తుంది. విష్ణు సహస్రనామ అన్ని నామాలతో కూడిన సుమారు 36 వేల నామాలతో హెూమాది కార్యక్రమాలు పండితులు నిర్వహిస్తారు. వాసుదేవా చార్ కానుగోవి ఆధ్వర్యంలో ఆరవసారి జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సుధా పండితులు సుమంత్ ఆచార్ పాటిల్ (విజయవాడ), రఘుప్రేమచార్ (గుంటూరు), రఘోత్తమాచార్ (విజయనగరం), విజయ సింహాచార్ (రాజమండ్రి) నగరానికి ఆగమిస్తున్నారు. బృహతి అనే మంత్రం విష్ణు భగవానుడిని ప్రతిపాదించడమే కాక వెయ్యి రూపాయలలో మనకు దర్శన శ్రావణ భాగ్యాన్ని కల్పించబడుతుంది. గరుడ రూపంలో హెూమగుండాన్ని నిర్మించి రుత్వికులు దీక్ష బద్ధులై హెూమాన్ని రెండు రోజులు పాటు నిర్వహిస్తారు, ఆదివారం మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంతో ఈ విశేష కార్యక్రమం పూర్తి అవుతుంది. అయితే శనివారం సాయంత్రం సుధా పండితులందరిచే విశేష ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృహతి సహస్ర యాగం ద్వారా మానవదేహంలోని 72,000 నాడీ మండలాలకు చెందిన భగవంతుడు రూపాలను కూడా చింతన చేయడమే కాక భగవంతుని యొక్క సహకారంతో మానవ జీవనంలోని అనేక మార్పులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందుకు నడిపించగలిగిన గొప్ప శక్తి పొందగలము. ప్రతి అవతారములోనూ భగవంతుడు చూపిన మహిమలను మరియు ఉపదేశాలను కూడా ఈ హెూమ కార్యక్రమాల ద్వారా అవగాహన చేసుకోవడానికి ఎంతో వీలు ఉంటుంది. ఈ హెూమ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వాసుదేవాచార్య శిష్యులు పండిత రామాచార్య (హైదరాబాద్) కూడా రావడం మధ్వ సభ కమిటీ సభ్యులు చేసుకున్న అదృష్టంగా ప్రస్తావించవచ్చును.

## సాధారణ ఎన్నికలు -2024 నిర్వహణలో భాగంగా ఈవీఎంల తొలి ర్యాండిమైజేషన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికలు -2024 నిర్వహణలో భాగంగా ఈవీఎంల తొలి ర్యాండిమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్.. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి తొలి ఈవీఎంల ర్యాండిమైజేషన్ ప్రక్రియను ముందుగా కలెక్టర్ జె.నివాస్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం రాండ్‌మైజేషన్‌లో ఆయా నియోజకవర్గాలకు అలాట్ అయిన ఈవీఎంలు, వివి ప్యాడ్ లను జిల్లా కలెక్టర్ ఆయా నియోజకవర్గాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో తొలి రాండిమైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే వారం నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల పై తగు అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ప్రధానంగా ప్రపోజర్స్, అఫిడవిట్లు, క్రిమినల్ కేసులు, వ్యయ ఎకౌంటు వంటి ఇతర విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి తర్వాతే నామినేషన్ దాఖలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాకినాడ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి.తిప్పే నాయక్, జిల్లా ఆడిట్ అధికారి, ఎక్స్పెండీచర్ నోడల్ అధికారి వై.సురేష్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి, ఈవీఎంల నోడల్ అధికారి ఎం.సునిల్ కుమార్, ఎన్ఐసీ ఐటీ డైరెక్టర్ సీహెచ్.సుబ్బారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాంబాల వెంకటేశ్వరరావు (బీజేపీ), రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), గదుల సాయిబాబా (టీడీపీ), బందారు జయప్రకాష్ (ఐఎన్సీ), సబ్బారాపు అప్పారావు(బిఎస్పీ), ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించిన ఫ్లిప్‌కార్ట్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** భారతదేశంలోని స్వదేశీ ఇ-కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ విశాఖపట్నంలో తన కిరాణా ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా తమ కార్యకలాపాలను విస్తరించిందని హెరిటేజ్ ఫుడ్స్ సీఈఓ శ్రీదీప్ కేశవన్, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ హెడ్, వైస్ ప్రెసిడెంట్ హరి కుమార్ తెలిపారు. స్థానిక వినియోగదారులకు మరుసటి రోజు కిరాణా డెలివరీలను అందిస్తోందన్నారు. ఫ్లిప్‌కార్ట్ తమ స్థానిక వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఫ్రీడమ్ హెరిటేజ్ వంటి ప్రముఖ ప్రాంతీయ బ్రాండ్ల క్యూరేటెడ్ శ్రేణిని అందిస్తుందని, అలాగే డైరీ, గుడ్లు, చాక్లెట్లు, స్టేపుల్స్, క్లీనింగ్ ఎయిడ్స్ మరిన్ని వంటి వర్గాల నుండి 6,000 కంటే ఎక్కువ ఉత్పత్తులను అందిస్తుందన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ గమ్యస్థానాలలో విశాఖపట్నం ఒకటనీ ఆన్లైన్ కిరాణా సామాగ్రి కోసం ప్రధాన మార్కెట్ గా వెలుగొందుతుందన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా, తమ కిరాణా అవసరాలకు సౌలభ్యం , విలువకు ప్రాధాన్యతనిస్తూ వివిధ విభాగాల నుండి వినియోగదారుల ప్రవాహాన్ని ఈ నగరం నుంచి చూసిందన్నారు. విస్తృతమైన విలువ ఎంపికను ఫ్లిప్కార్ట్ అందిస్తున్నందున, ఇది స్థానిక వినియోగదారుల నుండి కిరాణా డిమాండ్‌ను, రోజువారీ ఆర్డర్లలో బలమైన వృద్ధిని సాధించిందన్నారు. ఇది విజయవాడ తర్వాత రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రం అని చెప్పారు. ఈ కొత్త ఫుల్ ఫిల్మెంట్మె సెంటర్ దాదాపు 77,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంతో పాటు విశాఖపట్నంలో రోజుకు 8,000 ఆర్డర్లను ఇది ప్రాసెస్ చేయగలదని చెప్పారు. ఈ ప్రాంతంలోని అనేక చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈ, స్థానిక రైతుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా ఇది దాదాపు 1,000 ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించనుందని తెలిపారు.

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
13 ఏప్రిల్ 2024



## చిరస్మరణీయుడు మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి..



కూనవరం, మేజర్ న్యూస్ : మాజీ శాసనసభ్యులు కుంజా బొజ్జి మూడవ వర్ధంతి సభ మండలంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ బొజ్జి మూడు సార్లు ఎమ్మెల్యే గా వరుసగా ఎన్నిక అయ్యారని అన్నారు. గ్రామ స్థాయి సర్పంచ్ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గుర్తు చేసారు. గిరిజన హక్కుల కోసం చట్టాల రక్షణ కోసం కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, ఎంపీటీసీ అమ్మాజి, బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలేపల్లి ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన గిడుగు రుద్రరాజు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం స్థానిక రూరల్ మండలం కవల గొయ్య గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారికీ పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్ర రాజు ముఖ్య అతిధిగా పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రచారం వాహనాలను ప్రారంభించారు. గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి కాంగ్రెస్‌కి ఓటు వేయవలసిందిగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గిడుగు మాట్లాడుతూ ఈ దేశానికీ ఈ రాష్ట్రానికి మేలు చేయగలిగేది ఒక్క కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు కాంగ్రెస్‌కి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలేపల్లితో పాటు కాంగ్రెస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎమ్‌ల తొలి రాండమైజేషన్

**-తొలిరోజు పార్లమెంటు నియోజకవర్గ ఈవిఎమ్‌ల రాండమైజేషన్**
**-జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో రాండమైజేషన్**
**-కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ వారి సూచనలు మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికలలో వినియోగించే ఈవీఎమ్ ల మొదటి రాండమైజేషన్ ను షెడ్యూలు మేరకు శుక్రవారం చేపట్టడం జరుగుతోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత తెలియ చేశారు. శుక్రవారం ఉదయం రాజమహేంద్రవరం లోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియని స్వయంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ - నలబాటి రమేష్ (శ్యామ్) , టిడిపి - సిహెచ్. శ్రీనివాస రావు , సలాది ఆనంద్, బిజెపి - జి.వెంకటరావు, వైయస్ఆర్ సీపీ - వైవిఎస్ శ్యామల, ల సమక్షంలో కలెక్టర్ పరిశీలించడం, కేటాయింపు ప్రక్రియ పర్యవేక్షణ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏప్రియల్ 12 , 13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆప్రక్రియ లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రాండమైజేషన్ నిర్వహించినట్లు తెలియజేశారు. తొలుత రాండమైజేషన్‌కి సంభందించి అనుసరిస్తున్న విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర సమాచారాన్ని అందచేశారు. జిల్లా స్ట్రాంగ్ రూం సెంటర్‌లో బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్ స్కానింగ్ పనులు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఈ కేంద్రంలో భద్రపరచిన జిల్లాకు కేటాయించిన 5,971 బ్యాలెట్ యూనిట్స్, 5,463 కంట్రోల్ యూనిట్స్, వివిపాట్ యూనిట్స్ 4,927 లను సాంకేతికంగా తనిఖీ చేసి, వాటి పని తీరును నిర్ధరణ చెయ్యడం ఆయా యూనిట్స్ పనితీరుపై కేంద్ర ఎన్నికల కమిషన్ కు నివేదిక ఇచ్చినట్లు తెలియ చేశారు. ఒక్కో ఈవిఎమ్ భద్రపరిచే బాక్సులో 10 యూనిట్స్ ఉంటాయని, వాటినీ ఒక టేబుల్ వద్ద కేంద్రీకృతం చేసి , ఒక్కో యూనిట్ ఒక్కో అసెంబ్లి నియోజక వర్గానికి చొప్పున 7 నియోజక వర్గాలకు కేటాయించి, వాటికి సంబంధించిన సీరియల్ నంబర్ల ను స్కానింగ్ చెయ్యడం జరుగుతుందనీ జిల్లా ఎన్నికల అధికారి డా కే. మాధవీలత అన్నారు. ప్రతి నియోజక వర్గానికి యూనిట్స్ అలాట్ చేసిన తర్వాత, వాటినీ ఆయా నియోజక వర్గాల స్థాయిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లకు జిపిఎస్ ట్రాకింగ్ వాహనాల ద్వారా అత్యంత భద్రత మధ్య పంపించడం జరుగుతుందని తెలియ చేశారు. పార్లమెంటుకి సంబంధించిన ఈవీఎమ్ రాండమైజేషన్ చెసి ఆయా నియోజక వర్గాల కు తరలించనున్నట్లు తెలిపారు. ఆయా నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్ వద్ద రిటర్నింగ్ అధికారులు కట్టుదిట్టమైన భద్రతా, సి సి టివి లు, అగ్నిమాపక భద్రత చర్యలు, విజిటర్స్ పుస్తకం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలను,మార్గదర్శకాలను అనుసరించి రిటర్నింగ్ అధికారులు ఈవీఎం గోడౌన్‌లో మొదటి రాండమైజేషన్ పనులను పర్యవేక్షించడం జరిగిందన్నారు.

ఇందు కోసం ఆయా నియోజక వర్గాల నుంచి 11 మంది స్టాఫ్ నియమించామన్నారు. ఆయా నియోజక వర్గాల వారీగా కేటాయించిన సీయూలు, బీయూలు, వీవీప్యాట్‌లను నియోజక వర్గాల వారీగా అందజేయాలని ఈవిఎంల నోడల్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్ర వర్షిణిని కలెక్టర్ ఆదేశించార ు.రాండమనైజేషన్ కార్యక్రమంలో రాజమండ్రీ రూరల్ ఆర్వో జెసి - ఎన్. తేజ్ భరత్, రాజమండ్రి అర్బన్ ఆర్వో, మునిసిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో , సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ , డిఆర్వో జీ. నరసింహులు, రాజానగరం ఆర్వో/ ఆర్డీఓ ఏ.చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్వో - కె ఎల్ శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎమ్. మాధురీ, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణా నాయక్, రాజమండ్రీ పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి - ఎస్.డి.సి. ఆర్.కృష్ణా నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎమ్. భాను ప్రకాష్, పి. సువర్ణ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో గల పునరావాస కేంద్రం (ఆలంబన రిహాబిలిటేషన్ సెంటర్) నందు గల ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం అందించడం కొరకు పోషక విలువలు కలిగిన పప్పు దినుసులను పంపిణీ చేయడం జరిగింది అని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏ. రమేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఒక రూపాయి ఫండ్ తో సుమారు 10000/-రూ. ల విలువైన పౌష్టిక ఆహారం ఏర్పాటు చెయ్యడం జరిగింది అని డా. ఎమ్. రఘునాథ్ తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో40మందికి పైగావిద్యార్థులుపాల్గొన్నారు. పౌష్టికా హార విలువల గురించి ఎయిడ్స్ బాధితులకు తెలియ జేసినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.రమేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ పి.వో డా. ఎమ్. రఘునాథ్, ఎస్.గోపి సాయి రామ్ మరియు 40 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రారంభించిన చేయూత పథకం డబ్బులు ఏమయ్యాయి..?

**-సిపిఎం సూటి ప్రశ్న**




**కూనవరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న జగనన్న చేయూత పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అట్టహసంగా మండల కేంద్రం లో లో సమావేశం ఏర్పాటు చేసి మహిళలను మోసం చేసారని పెద్దర్కూర్ ఎంపీటీసీ ధర్ముల అమ్మాజి అన్నారు. నాలుగు మండలాల నుండి జనాలను వాహనాలపై తరలించి తమ బలాన్ని ప్రదర్శించేందుకు తప్ప మహిళలకు మేలు జరగ లేదని ఆమె అన్నారు.చేయూత డబ్బులు పడ్డాయేమో అని బ్యాంకులకు పరుగు తీస్తున్న మహిళలను బ్యాంకు సిబ్బంది డబ్బులు ఇంకా జమ అవ్వలేదని సమాధానం చెప్పడం జరుగుతుందని అన్నారు. కొంత మందికి బ్యాంకు సిబ్బంది సరైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు.ఇలా మహిళలను మోసం చేయడం ఒక మహిళా ఎమ్మెల్యేకి తగదని అన్నారు.ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఎన్నికలు వస్తున్న వెల ఇటువంటి మోసపూరిత మాటలను ఆపేయ్యాలని హితవు పలికారు.రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం పార్టీ ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య,సీపీఎం జిల్లా కమిటి సభ్యులు మేకలనాగేశ్వరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య,బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు,పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు ఆదర్శప్రాయుడు

**-నిస్వార్థ రాజకీయాలకు కుంజా బొజ్జి ఆదర్శం**





**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఆదివాసీహక్కుల సైనికుడు, స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి,వర్ధంతి తన స్వగ్రామంలో అడివి వెంకన్నగూడెంలో సి.పి.ఎం,పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుమ గ్రామ స్థులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించి, చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఎం.పి.పి.కారం లక్ష్మి జెండా ఆవిష్కరించారు. జోహార్ కుంజా బొజ్జి అంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు,మాట్లాడుతూ గ్రామస్థాయి సర్పంచ్ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని ఆయన గుర్తుచేశారు. చట్టసభల్లో గిరిజన హాక్కులకోసం,చట్టాల రక్షణ కోసం కృషి చేశారని ఆయన అన్నారు. ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు ఆయన స్ఫూర్తితో పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే బొజ్జి మూడు పర్యాయాలు ఎమ్మెల్యే గా పనిచేసినా అతిసాధారమైన జీవితం గడిపారని,కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాడని ఆయన అన్నారు.కనీసంసరైన ఇల్లుకూడా లేకుండా నిస్వార్థంగా పనిచేసిన ఆయన బస్ ల్లో తిరిగే వారని,అసెంబ్లీ సమావేశాలకు రిక్షాలో వెళ్ళేవారని ఆయన అన్నారు.అతి సాధారమైన జీవితం గడిపిన నిజమైన కమ్యూనిస్టు నేత కుంజా బొజ్జి ని ఆయన అన్నారు. చివరి దశఖాంతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు. ఆయన ఆదర్శాలు స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కార్యకర్తలను కోరారు.ఈవర్ధంతి సంఘీభావ సమావేశంలో సీనియర్ నాయకులుజిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ,పంకు సత్తిబాబు, వడ్లది రమేష్, కారం సుందరయ్య, చీరపు తాతబాబు రెడ్డి, గుండెపూడి లక్ష్మణ్ రావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణపై ఎన్నికల అధికారులకు శిక్షణ





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎంలు, వివి ప్యాడ్‌లపై పూర్తిస్థాయి శిక్షణ పొందాలని రంపచోడవరం సబ్ కలెక్టర్, 53 రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలు, వివి ప్యాడ్స్ పై శిక్షణ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు, 59 మంది సెక్టార్ అధికారులను, అదేవిధంగా 73 మంది రూట్ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై. రామవరం మండలాలకు సంబంధించిన 307 మంది పిఒలకు. ఏపీఓలకు ముందుగా ఈవీఎంలు, వివి ప్యాడ్‌లపై అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందురోజు ఈవీఎంలు, వివి ప్యాడ్లు రిసెప్షన్ సెంటర్లో తీసుకున్నప్పటి నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్నికలు సక్రమంగా నిర్వహించి తిరిగి వచ్చి ఈవీఎంలు, వివి ప్యాడ్లు తిరిగి అప్పగించే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల సిబ్బందిని ఆయన ఆదేశించారు. పోలింగ్ జరుగు రోజు ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని, అందుకు ఎన్నికల సిబ్బంది పక్కాగా శిక్షణ పొందాలన్నారు. పోలింగ్ రోజున ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో సుమారు 600 నుండి వెయ్యి మంది లోపు ఓటర్లు ఉంటారని, అదేవిధంగా ఓటర్లతో ఎటువంటి తగాదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ కు ముందు రోజు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళినప్పుడు ఆ రోజే వివిధ రకాల ఫారాలు నింపడం పై అవగాహన చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. రెండు గంటలకు ఒక్కసారి ఎన్నికల పోలింగ్ శాతాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ తప్పనిసరిగా ఫాలో అవ్వాలన్నారు. ఈవీఎంలు, వివి ప్యాడ్లు పై అవగాహనకు సంబంధించి శిక్షణ నియోజకవర్గం మాస్టర్ ట్రైనర్స్ తో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా ఒకటికి రెండుసార్లు వివరంగా తెలియజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మొత్తం ఏడు రూముల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి అన్ని రూములలో పిఓలకు, ఏపీఓలకు ఈవీఎం లు, వివి ప్యాడ్లు తదితర విషయాలపై పిఒలకు, ఎపీఓ లకు సూచనలు రిటర్నింగ్ అధికారి తెలియజేయడం జరిగింది. పిఓలకు, ఎపీఓ లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, ఎ.వి.రమణ, డి.వి.సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్లు యన్.వి.వి. సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, బాలాజీ, శివ, శ్రీధర్, విశ్వనాథం, స్వామి, జి. సత్యనారాయణ, వీరభద్రరావు, సరిత, రెవిన్యూ ఇన్స్పెక్టర్ యన్. విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయి, లక్ష్మణ్, వీఆర్వోలు పిఓలు, ఎపివోలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో అనపర్తి జిబిఆర్ విజయ కేతనం.. విద్యార్థునుల హవా..

**-ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో అనపర్తి జిబిఆర్ విద్యార్థులు విజయ కేతనం మోగించారు. జిబిఆర్ విద్యార్థులు అన్ని గ్రూపుల్లోనూ అత్యధిక మార్కులు సాధించి రికార్డ్ నమోదు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలియజేశారు. ఫలితాల్లో విద్యార్థునుల హవా కొనసాగింది. జిబిఆర్ విద్యార్థులు జూనియర్ - సీనియర్ విభాగాల్లోనూ అదే ప్రభంజనాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా విజేతలను స్థానిక శాసనసభ్యులు డా. సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, విరి విజయానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ స్వామితో పాటు బోధనా సిబ్బందిని విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), పాలకవర్గ సభ్యులు గొలుగూరి రామారెడ్డి, జిబిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపిల్ డాక్టర్ ఎన్. పి.అబ్బాయిరెడ్డి, పీజీ కోర్సులు డైరెక్టర్ బి. రత్నారెడ్డి, జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ గొలుగూరి జగన్నాథరెడ్డి తదితరులు అభినందించారు.

## తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలి

**-కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్**





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట శ్రీరామ్ నగర్ లో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ తన తండ్రి జగ్గంపేట నియోజకవర్గం జనసేన, బిజెపి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూని గెలిపించమని ఇంటింట ప్రచారం నిర్వహిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి రేపు రాబోయే ఎన్నికల్లో సంక్షేమ అభివృద్ధి సమాంతరంగా అందించే సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించాలంటే ఇక్కడ జ్యోతుల నెహ్రూ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలోనూ జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇసుక,లిక్కర్, మట్టి దోపిడీద్వారా వారి ఆస్తులను పెంచుకున్నారన్నారు. ప్రజలను అడుగడుగున ఇబ్బందులు పెట్టారన్నారు. రాబోయే ఎలక్షన్ లో కష్టపడి తెలుగుదేశం, పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటే ప్రజా సమస్యల తీరుతాయని రాష్ట్ర అభివృద్ధి చెందడంతో పాటు జగ్గంపేట నియోజవర్గం కూడా అభివృద్ధి చెందుతుందని దీనికోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగా రావు, సత్తి సదాశివరెడ్డి, దాపర్థి సీతారామయ్య, పీల మహేష్, నేదూరి గణేష్, పలివెల ఏసు రాజు, నండ్ల చిరంజీవి, దేగల సత్తిబాబు, ఎస్ వి ప్రసాద్, గంట రమణ, రాయి సాయి, కొండ్రోతు శ్రీను, వెలిశెట్టి బుజ్జి, రీసు రవణ, ముక్కా పాలు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 5.60 కోట్ల సొత్తు, రూ. 12 లక్షల నగదు సీజ్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న సుమారు రూ. 5.60 కోట్లు విలువైన 8 కేజీల 116 గ్రాముల బంగారం, 46 కేజీల వెండిని, మరో సుమారు రూ. 12 లక్షల నగదును ఫ్లైయింగ్ స్కాడ్ అధికారులు పట్టుకున్నారు. కాకినాడ నుండి విశాఖపట్నం వెళ్తూ పెద్దాపురంలోని ఓ నగల దుకాణం నుండి వెండి వస్తువులు తీసుకొని వెళ్తుండగా వాహనాన్ని పెద్దాపురం లో గురువారం అర్ధరాత్రి సమయంలో అధికారులు పట్టుకున్నారు. ఆ సొత్తు కు సంభందించి వాహనదారుల వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో అధికారులు సొత్తు ను స్వాదీనం చేసుకున్నారు. అలాగే శుక్రవారం సామర్లకోట మఠం సెంటర్లో నిర్వహించిన తనిఖీల్లో రెండు మోటారు సైకిళ్ల పై సుమారు రూ. 12 లక్షలు నగదును తరలిస్తుండగా వాటికి సంభందించి ఎలాంటిపత్రాలు వారివద్ద లేకపోవడంతో నగదును అధికారులు సీజ్ చేశారు. అలాగే వాహనాలను పెద్దాపురం ఆర్డివో కార్యాలయానికి తరలించారు.

# కొత్తగా మాకేం కోర్కెలు లేవు



**-ఒక ఫైర్ స్టేషన్,,,ఒక బస్ స్టేషన్.-ఒక పోలీస్ స్టేషన్**
**-పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ, ఆర్&ఆర్**
**-జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ**

**వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్ :** కొత్తగా మాకు కోర్కెలు ఏమీ లేవని,అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కాపాడేందుకు ఫైర్ స్టేషన్,దొంగతనాలు, చెడు వ్యసనాలకు లోనుకాకుండా, లా&ఆర్డర్ కాపాడేందుకు పోలీస్ స్టేషన్,ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా బస్ స్టేషన్,పోలవరం ముంపు బాధితులకు, ప్యాకేజీ, ఆర్&ఆర్, ఇవ్వాలని,జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, డిమాండ్ చేశారు.శుక్రవారం జనసేన పార్టీ,మండల కమిటీ సభ్యులుసమావేశంనిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వసతులు కల్పించాలని కోరినా అధికారులకు, ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని ఆయన వాపోయారు. గొంతెమ్మ కోర్కెలుకోరడంలేదని. ప్రజల అవసరాల దృష్ట్యా అవసరమైన వాటిని మాత్రమే అడుగుతున్నామని వీటిని పరిగణలోకి తీసుకోవాలన్నారు.పోలవరం నిర్వాసితులకు కచ్చితమైన హామీ ఇవ్వాలని వర్షాకాలం వచ్చిందంటే తీవ్రమైన ఇబ్బందులకు గురౌతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇబ్బందులు,రైతులకు సమయానుకూలంగా వ్యవసాయానికి భూములు అనుకూలించక ఇబ్బందులు, ఇంత జరుగుతున్నా కనీసం కేంద్రం ప్రభుత్వంగానీ,రాష్ట్ర ప్రభుత్వం గానీ,స్పందించకపోవడం విడ్డురంగా ఉందని ఆయన విమర్శించారు.కేంద్రానికి, రాష్ట్రానికి సమన్వయం లోపించిందని,నిర్వాశితుల పరిస్థితి ముందు నుయ్యి,వెనుక గొయ్యి,అనే సంధంగా తయారైందని,ఇదేనా సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వంఇచ్చేగౌరవమని ఆయన ప్రశ్నించారు.కనీసం ఎంతటైంలో పోలవరం నిర్మాణం పూర్తి చేస్తారో కూడా అధికారులకు,ప్రభుత్వానికి తెలియదాని ఆయన ప్రశ్నించారు.ఉమ్మడి ఎన్.డి.ఏ. అభ్యర్థులను,గెలిపించండి సమన్వయం ఉంటుంది సమస్యల పరిస్కారానికి పునాధి పడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కానూరులో రోడ్డు ప్రమాదం

**ఒక వ్యక్తి మృతి, ఒకరికి తీవ్ర గాయాలు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామంలో నిడదవోలు నరసాపురం రహదారిపై శశి కాలేజ్ వద్ద ఏప్రిల్ 11వ తేదీ గురువారం రాత్రి 11 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది అని పెరవలి ఎస్సై ఏజిఎస్ మూర్తి తెలియజేశారు . ఆయన చెప్పిన వివరాలు ప్రకారం పెరవలి మండలం, అన్నవరపాడు గ్రామానికి చెందిన వసంతాడ మధు, తండ్రి.శ్రీను, వయస్సు.20, అను వ్యక్తి కలవచర్ల లో తన దగ్గర బంధువు అయిన ముప్పిడి నాగ చరణ్ అను వారితో కలసి తన యొక్క మోటార్ సైకిల్ పై కలవచర్ల నుండి అన్నవరపాడు వెళుతుండగా వారికి ముందుగా వెలుతున్న లారీ నడుపుచున్న డ్రైవరు తన లారీ ని అజాగర్తగా నిర్లక్ష్యంగా నడుపుతూ ఒక్కసారిగా సడన్ బ్రేక్స్ వేయడం తో సదరు వసంతాడ మధు తన మోటార్ సైకల్ కు లారీ వెనుక బాగం తగలడం తో తల కి భలమైన రక్తగాయం అయ్యి అక్కడికక్కడే చనిపోయినట్లు, ముప్పిడి నాగ చరణ్ అను అతనికి దెబ్బలు తగిలినట్లు, మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెరవలి ఎస్.ఐ ఏ జి ఎస్ మూర్తి తెలిపారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
శనివారం
13 ఏప్రిల్ 2024



## గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యం



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** అప్పన్నపాలెం బ్రిడ్జి కింద ఏలేరు కాలవలో గుర్తుతెలియని మగ మృతదేహం లభించినట్లు స్థానిక ఎస్సై జి సతీష్ తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో గల అప్పన్నపాలెం బ్రిడ్జి దగ్గరలో ఏలేరు కాలువలో గుర్తు తెలియని సుమారు 30-35 సంవత్సరాలు వయస్సు గల మగ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. ఆ వ్యక్తి సుమారు రెండు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చు అన్నారు. ఆ వ్యక్తి నలుపు రంగు లోయర్ ధరించి ఉండి, గెడ్డం మూడు అంగుళాల పొడవుతో, జుత్తు నలుపురంగులో ఉండి, మెడలో అల్యూమినియం చైన్ ఉందన్నారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన యెడల ఏలేశ్వరం ఎస్ ఐ గాని, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ కు గాని తెలియపరచవలసిందిగా ఆయన కోరారు. 9440904835,08868224033 అని నెంబర్ లో తెలియపరచవలసిందిగా ఆయన కోరారు.

## 15 న మండల పరిషత్ సమావేశం

### -ఎంపీడీవో ఎం.ఉషారాణి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదీన మండల పరిషత్ సమావేశపు హాలు నందు ఉదయం 10.30గం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించబడనని ఎంపీడీవో ఎం ఉషారాణి ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, హాజరుకానున్నారని కావున మండల పరిషత్ పరిధిలో గల వివిధ శాఖల అధికారులందరూ విధిగా హాజరు కావాలని సూచించారు.

# ప్రకటన స్పష్టత లేదు.. ప్రచారం ఆగలేదు..

### -కూటమి నుండి ఇద్దరు అభ్యర్థులు పోరుకు రెడీ
### -టిక్కెట్ ఎవరిని వరిస్తుందో....?



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఉమ్మడి కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థి విషయంలో పూర్తి స్పష్టత రాలేదనే చెప్పుకోవచ్చు. ఇప్పటికే కూటమి తరపున అధికారకంగా ప్రకటించిన బిజెపి అభ్యర్థి శివరామకృష్ణమరాజు నియోజకవర్గంలో తన ప్రజారాన్ని కొనసాగిస్తుంటే, తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి, ఎన్నికల ప్రచారం యధావిధిగా కొనసాగిస్తున్నారు. ఇరు పార్టీలకు చెందిన ప్రచార రధాలు నియోజకవర్గంలో హెూరెక్కిస్తున్నాయి. మరో పక్క ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్సిపి ఎన్నికల ప్రచారాన్ని నియోజకవర్గంలో హెూరెక్కిస్తున్నారు. ఇక కూటమి అభ్యర్థి విషయంలో కార్యకర్తలకు ఇటువైపు తిరగలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మరోపక్క నల్లమిల్లి తన కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేసి మనం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, మన పార్టీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలకు చేరెందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని, పోలింగ్ బూత్ కమిటీల నియామకం, ఏజెంట్ల వ్యవహారం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కూటమిలోని మూడు పార్టీల అధినేతలతో మాట్లాడడం జరిగిందని అనపర్తి టికెట్ తెలుగుదేశం పార్టీకే ఇస్తారని కార్యకర్తలు నాయకులు వద్ద నల్లమిల్లి ధీమా వ్యక్తం చేస్తున్నారు. నల్లమిల్లిని బిజెపిలోకి రమ్మని, బిజెపి పార్టీ నుండి అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి పోటీ చేయమని బిజెపి సీనియర్ నాయకులు చెప్పినట్లుగా తెలుస్తుంది. అయితే నల్లమిల్లి మాత్రం తెలుగుదేశం పార్టీని వీడేది లేదని, తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తానని స్పష్టంగా చెప్పినట్లుగా తెలుస్తుంది. తప్పని పరిస్థితులలో పొత్తుల్లో భాగంగా అనపర్తి టికెట్ బిజెపికే కేటాయిస్తే నల్లమిల్లి కాషాయ కండువా ధరించి ఎన్నికలకు సిద్ధమవుతారా లేదా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తారా అని ప్రజల ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బిజెపి అభ్యర్థి శివరామ కృష్ణమరాజు పోటీలో నిలిచేది నేనేనని, పొత్తుల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాకు మద్దతుగా నిలుస్తాయని, పార్టీ అధిష్టానం చెప్పిన ప్రకారమే నడుచుకోవడం జరుగుతుందని ప్రజలు నన్ను గెలిపించేటప్పుడు సిద్ధంగా ఉన్నారని చెప్తున్నారు. కూటమి అభ్యర్థి ఎంపిక విషయంలో కొనసాగుతున్న ఉత్కంఠకు ఎప్పుడు తెర పడుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం మరో రెండు రోజుల్లో ప్రకటన వస్తుందని అని ప్రతిసారి చెప్పుకొస్తున్నారే తప్ప ప్రకటన రావడం లేదు. రేపటి నుండి ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచాలని నాయకులకు, కార్యకర్తలకు నల్లమిల్లి సూచిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో ఈ ఉత్కంఠకు తెర పడే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

## భక్తులకు ఉచిత వసతి సౌకర్యం...



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోటలో వేంచేసి ఉన్న శ్రీ కుమారారామ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం నందు భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం వసతి ఏర్పాట్లు కల్పిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహనాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ దేవస్థానానికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న అతి పురాతన దేవాలయం అయిన శ్రీ మాండవ్య నారాయణ స్వామి కళ్యాణ మండపం నందు భక్తులకు ఉచిత వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సౌకర్యం ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటున్నందున భక్తులు, యాత్రికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు దేవస్థాన కార్యాలయం నందు గానీ 7989389266 నెంబర్ కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. అలాగే ప్రతిరోజు భీమేశ్వర ఆలయంలో మధ్యాహ్నం 12 గంటల నుండి 2.00 గంటల వరకు నూరుకాళ్ళ మండపం నందు నిత్య అన్నదాన కార్యక్రమం జరుగుతున్నందున భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆలయ అధికారి నీలకంఠం తెలిపారు.

## ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి
## అభివృద్ధికి సహకరించండి : ఆదిలక్ష్మి



**రంగంపేట,మేజర్న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ఆర్సిపి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే సతీమణి సత్య ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డా. సత్తి సూర్యనారాయణ రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి అధికారం చేపట్టిన అప్పటి నుండి అభివృద్ధి సంక్షేమం పరుగులు తీశాయని, అన్ని రంగాలకు సమన్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం వైయస్ఆర్సీపీ అని అభివృద్ధి సంక్షేమం యధావిధిగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్ లను అఖండ విజయంతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో ఆదిలక్ష్మికి ప్రజల హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవిఎమ్‌ల తరలింపును ప్రత్యక్షంగా పర్యవేక్షించిన కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

### -అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు : ఆర్వో తేజ్ భరత్



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** రాజమండ్రీ రూరల్ నియోజకవర్గం, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ హాస్టల్ భవనం, కలెక్టరేట్, ధవళేశ్వరం నందు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తొలి విడత ఈ వి ఎమ్ లు చేరుకున్నాయని రాజమండ్రి రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ తెలియ చేశారు. శుక్రవారం రాత్రి రాజమండ్రీ రూరల్ నియోజక వర్గం పరిధిలో ఉన్న 267 పోలింగ్ కేంద్రాల కు సంబంధించిన బ్యాలెట్ యూనిట్స్ కలక్టరేట్ ఆవరణలో ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ చేరుకునే ప్రక్రియని జాయింట్ కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా రాజమండ్రీ రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎన్. తేజ్ భరత్ వివరాలు తెలియ చేస్తూ, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కే. మాధవీలత ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈవీఎమ్ లని తరలింపు ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. నియోజక వర్గ పరిధిలో ఉన్న 267 పోలింగ్ కేంద్రాల కు సంబంధించిన 320 చొప్పున బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ లు రిజర్వ్ యూనిట్స్ కేటాయించడం జరిగిందన్నారు. వాటినీ అత్యంత భద్రత మధ్య డీ సి ఎం ఎస్ వాహనం ద్వారా రూరల్ స్ట్రాంగ్ రూమ్ కి తీసుకుని రావడం జరిగిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకుచెందిన బ్యాలెట్ యూనిట్స్ ,కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ లను భద్ర పరుచుటకు అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. పార్లమెంటుకిచెందినయూనిట్స్ నియోజక వర్గానికి కేటాయించిన సాయుధ ఎస్కార్ట్ బృందం ఆధ్వర్యంలో వచ్చాయని తెలిపారు. స్థానిక జిల్లా స్థాయి స్ట్రాంగ్ రూమ్ వద్ద మున్సిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్డీవో చైత్ర వర్షిణి, పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్. కృష్ణ నాయక్, ట్రైనీ ఎస్ డి సి ఎం. భవానీ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు, డిప్యూటి తహసీల్దార్లు, ఇతర అనుబంధ సిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతికి కాదు.. సంక్షేమానికి ఓటు వేయండి..

### -అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి
### -పెదపూడిలో భారీ బైక్ ర్యాలీ



**పెదపూడి, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు నిజానికి, అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధమని, అబద్దానికి కాకుండా ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి నిజాయితీకి ఓటు వేయాలని అనపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే, వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పెదపూడి మండలంలో వైకాపా భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. తొలుత రామేశ్వరం నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ 15 గ్రామాలు మీదుగా సాగింది. అనంతరం జి. మామిడాడలో బైక్ ర్యాలీ ముగ్గింపు కార్యక్రమం నిర్వహించారు. పెదపూడిలో ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు మార్ని కామరాజు చౌదరి, వైకాపా రాష్ట్ర నాయకుడు పప్పు సింహాచలం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు భారీ గజమాలను క్రేన్ ద్వారా వేసి అపూర్వ స్వాగతం పలికారు. దుస్సాలువలు కప్పి మంగళ హారతులతో ఘన సత్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ నిర్వహించిన ర్యాలీకి స్థానికులు ఘనస్వాగతం పలికారు. కాకినాడ పైన ప్రధానరహదారి వాహనలతో కిక్కిరిసింది. ర్యాలీకి అడుగడుగునా మహిళలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని నిలబెట్టుకున్నామని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి మాత్రమే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతుందన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ చెప్పిన సమయానికి అమలుపరుస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు, కరకుదురు సర్పంచ్ ఉంద్రు చంద్రకళ సత్యనారాయణ, గుత్తుల రమణ, చింతా దొరబాబు, వేంద్ర సర్పంచ్ కోసూరి వాసు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా తోలేటి సూర్యనారాయణ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక పెన్షనర్ల సంఘం భవనంలో అధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగాఎన్నుకోవడంఅయినది. అధ్యక్షుడిగా తోలేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం మల్లేశ్వర రావు, గౌరవఅధ్యక్షుడు గా చంద్రమౌళి వెంకట శాస్త్రి, ఉపాధ్యక్షుడుగా డి.అమృత రావు, ర్గనైజేషన్ కార్యదర్శిగా మార్నీడి సత్యనారాయణ కోశాధికారిగా గంద్రోజు విశ్వనాథం, మహిళా కార్యదర్శిగా జే ఈ.ఎం.కుమారి వీరితో పాటు 22 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనది. ఎన్నికల అధికారిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు ఎం. వీరభద్ర స్వామి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెల్పిరి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ సదరు కార్యవర్గం మూడు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారని, సమిష్టిగా పనిచేసి సంఘాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి నరసింహ రావు మాట్లాడుతూ జగ్గంపేట యూనిట్ మంచి గుర్తింపు తెచ్చుకున్నదని దీని కారణం ఇక్కడ పనిచేయుచున్న నాయకత్వం అని ఎప్పటికప్పుడు సమస్యలు మా దృష్టికి తెస్తున్నదని దానిని సత్వరం పరిష్కరిస్తున్నామని అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని పెన్షనర్ల ఎడల అలసత్వం చూపించినదని పేర్కొన్నారు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. రామారావు గారు మాట్లాడుతూ రాబోయే కాలంలో మరింత సమర్థవంతంగా జగ్గంపేట యూనిట్ పనిచేయాలని అనేక సమస్యలపై మీ పోరాటంలో ముందుండాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి యం.మల్లేశ్వర రావ మాట్లాడుతూ మా టీమును ఏకగ్రీవంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా తోలేటి సూర్యనారాయణ స్థానిక ఫెంక్షనల్ల సంఘం భవనంలో అధ్యక్షుడు చంద్రమౌళి వెంకట శాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంఅయినది అధ్యక్షుడిగా తోలేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడుగా చంద్రమౌళి వెంకట శాస్త్రి,ఉపాధ్యక్షుడుగా డిఅమృత రావు , ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మార్నీడి సత్యనారాయణ కోశాధికారిగా గంద్రోజు విశ్వనాథం, మహిళా కార్యదర్శిగా జే .ఈ. ఎం. కుమారి వీరితో పాటు 22 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనదిఎన్నికల అధికారిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు ఎం. వీరభద్ర స్వామి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెల్పిరి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ సదరు కార్యవర్గం మూడు సంవత్సరాలు పదవిలో కొనసా గుతారని, సమిష్టిగా పనిచేసి సంఘాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరిరి. రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ జగ్గంపేట యూనిట్ మంచి గుర్తింపు తెచ్చుకున్నదని దీని కారణం ఇక్కడ పనిచేయుచున్న నాయకత్వం అని ఎప్పటికప్పుడు సమస్యలు మా దృష్టికి తెస్తున్నదని దానిని సత్వరం పరిష్కరిస్తున్నామని అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని పెన్షనర్ల ఎడల అలసత్వం చూపించినదని పేర్కొన్నారుజిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. రామారావు గారు మాట్లాడుతూ రాబోయే కాలంలో మరింత సమర్థవంతంగా జగ్గంపేట యూనిట్ పనిచేయాలని అనేక సమస్యలపై మీ పోరాటంలో ముందుండాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అధ్యక్షుడు తోలేటి సూర్యనారా యణ, ప్రధాన కార్యదర్శి యం .మల్లేశ్వర రావు మాట్లాడుతూ మా టీమును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందులకు ధన్యవాదములు తెల్పిరి. మీ అందిరి సహాయ సహకారంతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్ళతామని హామీ ఇచ్చారు.

## నడుపల్లి గ్రామంలో
## దుర్గేష్ సోదరీమణుల ఇంటింటి ప్రచారం



**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం నడుపల్లి గ్రామంలో ఏప్రిల్ 12వ తేదీ శుక్రవారం నిడదవోలు జనసేన, తెలుగుదేశం మరియు భారతీయ జనతా పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ సోదరీమణులు మీనా కుమారి మరియు సుబ్బయ్యమ్మ ఇంటింటా ఉమ్మడి పార్టీల మేనిఫెస్టో పంపిణీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి తమ సోదరుడు కందుల దుర్గేష్ ను గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల జనసేన అధ్యక్షుడు పీప్పర రవి నడిపల్లి గ్రామ టి.డి.ఫి అధ్యక్షులు వెంకట నారాయణ జనసేన గ్రామ అధ్యక్షులు పూల్లసత్తిబాబు,ఈడ్పుగంటి నారాయణ, పిచుకుల ప్రబాకర్ , కానూరు ఎంపీటీసీ భర్త కొలా సీతయ్య నాయుడు, మల్లేశ్వరం కోటిపల్లి దేవికారాణి, మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళి కృష్ణ , పోగ్రామ్ కమిటీ మూర్తి మరియు టి.డి.పి జనసేన నాయుకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో
## ఎం.ఎన్.ఆర్ విద్యార్థుల విజయభేరి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో అనపర్తి ఎం.ఎన్.ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను షేక్ సువాన్ బేబీ 462, టీ.వి.డి. మంగాదేవి 453, సీఈసీ గ్రూపులో 500 మార్కులకు గాను ఎస్.సురేఖ 450, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకు గాను కే.లక్ష్మీ సురేఖ 981, పి.జాహ్నవి లక్ష్మీ సాయి దుర్గ 979, కే.దివ్య జ్యోతి 976, డి.ఈక్షిత 975, షేక్.అయేషా 969, సిహెచ్.రేవతి 967, ఎస్.దివ్య 966, పి.దేవి సుప్రియ 961, ఐ.శ్రావ్య 960, యు.ఎస్.డి. కిరణ్ సతీష్ 959, ఎం.రేణుక రెడ్డి 958, కే. శృతి 957, పి. సిరి కృష్ణ 956, కే.కీర్తన్ కుమార్ 953, బైపిసి గ్రూపులో 1000 మార్కులకు గారు ఎన్.రత్న తేజస్విని 972, ఏ.దేవి ప్రియాంక 972 సీఈసీ గ్రూపులో 1000 మార్కులకు గాను ఎం.పవన్ కుమార్ 932, బి.రాజ్ ధనుష్ 918 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సతీష్ రెడ్డి తెలిపారు. అతి తక్కువ ఫీజులతో, అత్యుత్తమ క్రమశిక్షణతో గ్రామీణ విద్యార్థులతో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఎం.ఎన్.ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణ రెడ్డి అభినందించారు. సత్యభామ స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, ఎం.ఎన్.ఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్స్ ఎన్.నవీన్, టి.రామభద్రారెడ్డి, ఐఐటి అండ్ నీట్ ఇంచార్జ్ శివయ్య, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ బి.చలపతి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థులపై అయోమయం?

### -కూటమి నేతకు పొత్తుధర్మం పాటిస్తారా?

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** పోలవరం అసెంబ్లీ ఎస్టి రిజర్వుడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని పలువురు బహిరంగంగా చెబుతున్నారు. వైసిపి కి కొత్త అభ్యర్థిని ఎంపిక చేస్తే పార్టీలో జోష్ ఉండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పై నియోజకవర్గంలో అసంతృప్తిగా ఉండడంతో ఆయన సతీమణికి టిక్కెట్ ఇవ్వడంపై ఇద్దరిలో ఎవరికి ఇచ్చినా ఒక్కటే అంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలు గుసగుసలాడుతున్నారు. పైగా కుల ధ్రువీకరణపై కొంతమంది కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసింది. ఒకవేళ నామినేషన్ల పరిశీలనలో ఏమైనా తేడాలు వస్తే మళ్లీ ప్రస్తుత ఎమ్మెల్యేకే టికెట్ ఇస్తారని నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతుంది. కాగా ఎంతోమంది తెలుగుదేశం పార్టీ నేతలు పోటీ పడినప్పటికీ చివరికి జనసేన సీటు దక్కించుకుంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి కష్టపడుతున్న చిర్రి బాలరాజు నిత్యం ప్రజల్లోనే ఉంటూ తనకంటూ ఒక గుర్తింపుని సంపాదించుకున్నారు. అయితే పొత్తుల్లో భాగంగా పోలవరం జనసేన కి వెళ్లడంతో తెలుగు తమ్ముళ్లు అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. జనసేన పేరు ప్రకటించగానే టిడిపి శ్రేణులు ఆందోళనకు గురయ్యారు. అధినాయకత్వం మాటను గౌరవించి పొత్తు ధర్మం పాటిస్తారా? అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తారా? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. అభ్యర్థిని ప్రకటించాక తెలుగు తమ్ముళ్లలో ఎటువంటి ఉత్సాహం కనపడటం లేదు. పార్టీ కార్యక్రమాల్లో కానీ అభ్యర్థి ప్రచారంలో కానీ తమ్ముళ్లు కానరావడం లేదని పార్టీ నాయకులతో పాటు ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. గత 4 రోజుల నుండి అభ్యర్థిని మారుస్తారనే ఆరోపణలు జోరుగా వస్తున్నాయి. అందుకు ఉదాహరణ ఇటీవల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు అభ్యర్థిని మార్చాలని కోరినట్లు పుకార్లు షికార్లుగా వస్తున్నాయి. ఇటీవలే ఐవిఆర్ఎస్ సర్వే కూడా నిర్వహించినట్లు టిడిపి నేతలు చెబుతున్నారు.